RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 236 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 సెప్టెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## విపక్షాలపై ప్రధాని మోదీ విసుర్లు

రాంచీ : రాష్ట్రంలో ఖనిజాలు, మైనింగ్, సైన్యం భూములు దొచుకున్న అధికార జారండ్ ముక్తి మోర్చ పార్టీని ఇంటికి సాగనంపే సమయం ఆసన్న మైందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జంషెడ్‌పూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార జేఎంఎం తోపాటు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆర్జేడీపై ఈ సందర్భంగా ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. తమను లక్ష్యంగా చేసుకుని అవినీతి కేసులు పెడుతుందంటూ బీజేపీపై అధికార జేఎంఎం నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రధాని మోదీ ఎండగట్టారు. జారండ్‌లోని జేఎంఎం ప్రభుత్వం.. కాంగ్రెస్ స్కూల్ ఆఫ్ కరప్షన్‌లో శిక్షణ పొందిందని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు.

# హరీశ్ రావు యాక్షన్ షురూ..

# కేసీఆర్ శకం క్లోజ్ అయినట్లేనా?





హైదరాబాద్ : అధికారం కోల్పోయాక బీఆర్ఎస్‌లో సమీకరణలు పూర్తిగా మారిపోతున్నాయి. ఉద్యమకాలం నుంచి మొన్నటి లోక్‌సభ ఎన్నికల వరకు కారుని పరుగులు పెట్టించిన కేసీఆర్.. స్టీరింగ్ వదిలేసి ఫాంహౌస్‌కి పరిమితమయ్యారు. అప్పట్లో చిన్నబాస్‌గా ఫోకస్ అయిన కేటీఆర్ ప్రెస్‌మీట్లు, సోషల్‌మీడియా పోస్టులతో సరిపెట్టేస్తున్నారు. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో హరీశ్‌రావు దూకుడు గులాబీశ్రేణుల్లో జోష్ నింపుతోంది. గులాబీ పార్టీకి అన్నీతానే అయినట్లు వ్యవహరిస్తున్న హరీశ్‌రావును ప్రశంసలతో ముంచెత్తుతూ ఆయన అభిమానులు సోషల్ మీడియాలో చేస్తున్న హడావుడితో గులాబీ బాస్ ఇక రిటైర్ మెంట్ తీసుకున్నట్లేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాడి కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్లో నేను సైతం అంటూ ఎంటర్ అయి సైబరాబాద్ సీపీ కార్యాలయం ముందు ఆందోళన చేసిన తన్నీరు హరీశ్‌రావుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ టైంలో జరిగిన తోపులాటలో ఆయన గాయపడ్డారు. సదరు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. హరీష్ అభిమానులు దాన్ని లైకులు, షేర్లతో వైరల్ చేస్తున్నారు. పోరాటం మన వారసత్వమని మరవకు సోదర.. థాంక్యూ రేవంత్.. మళ్లీ ఉద్యమం చేసే అవకాశం మా యువతకు ఇచ్చావ్.. మీడియా, సోషల్ మీడియా అంతగా లేనప్పుడే ఉద్యమాన్ని ఉరకలెత్తించినం. ఇప్పుడు అన్ని ఉన్నాయి. చూస్కో మళ్ల.. ఆగం ఐతున్న మా రాష్ట్రం కోసం తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న ప్రతీ యువత కదులుతం.. అంటూ హరీశ్‌రావుకి సంఘీభావం ప్రకటిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నాటి వేడి గుర్తొచ్చే బ్యాక్‌గ్రౌండ్‌తో హల్‌చల్ చేస్తున్న ఆ వీడియోని చూస్తూ బీఆర్ఎస్‌లోని సీనియర్లు, ఉద్యమకారులు ఉద్యమకాలం నాటి రోజులు గుర్తుచేసుకుంటున్నారు. 2009 నవంబరు 29న కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కసం ఆమరణదీక్షకు కూర్చున్నారు. తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో ఆరోజు కేసీఆర్ హడావుడి చేశారు.. అందుకే నవంబర్ 29ను దీక్షా దివస్ అని పిలుచుకుంటుంటాయి గులాబీ శ్రేణులు.. ఇప్పుడు హరీష్ వీడియోని చూస్తూ అప్పటి కేసీఆర్‌ని యాద్ చేసుకుంటున్నాయి. అంతలావున హడావుడి చేసి సావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చానని చెప్పుకున్న కేసీఆర్‌ని రెండు సార్లు ముఖ్యమంత్రిగా చూసిన ప్రజలు. ఇక చాల్లే అని పక్కన పెట్టేశారు. తెలంగాణ జాతిపితగా తన అనుచరులతో పిలుపించుకున్న కేసీఆర్ ఆ పరాభవంతో కారు స్టీరింగ్ వదిలేసి ఫాంహౌస్‌లో సెటిల్ అయిపోయారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అటు పార్టీలో ఇటు ప్రభుత్వంలో నెంబరు టూగా కేటీఆర్ చక్రం తిప్పారు. నెక్ట్స్ సీఎంగా పార్టీ నేతలు ఆయన్ని ఫోకస్ చేసుకున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో హరీష్‌రావు శకం ప్రారంభమైనట్లు కనిపిస్తుంది. పార్టీపై గ్రిప్ కోసం స్పీడ్ పెంచుతున్నారు. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ పార్టీలో కేసీఆర్, కేటీఆర్‌లు గుర్తుకురాకుండా దూకుడు పెంచుతున్నారు. కేసీఆర్ లేని గ్యాప్ పూడుస్తూ హరీష్ రావు ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి పోరాటాలు అంటే హరీష్‌రావుతో కేటీఆర్ పోటీ పడలేరన్నది నిజంగానే వాస్తవం. ఇలాంటి పరిస్థితుల్లో తన్నీరు హరీష్ రావు ఏ చిన్న అవకాశం దొరికినా వదలకుండా దానిని తనకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. కేసీఆర్ మెయిన్ స్ట్రీమ్‌లో నుంచి వెళ్లిపోయినప్పటి నుంచి నుంచి హరీష్ రావు అదే దూకుడు ప్రదర్శిస్తున్నారు. గులాబీ శ్రేణులకు కల్వకుంట్ల తండ్రి కొడుకులు లేని లోటు కనిపించకుండా చేస్తున్నారు. ఆ క్రమంలో బీఆర్ఎస్‌లో కల్వకుంట్ల దొర శకం ముగిసి తన్నీరు వారి హవా మొదలైందన్న టాక్ వినిపిస్తుంది.



## రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.




హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ పరిధిలో వినాయక నిమజ్జనాల కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సుమారు లక్ష విగ్రహాలను నిమజ్జనానికి తరలి రానున్న నేపథ్యంలో అందుకు సరిపడా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిమజ్జనం బందోబస్తు కోసం 25 వేల మంది పోలీసుల ను సిద్ధం చేశారు. నిమజ్జన ఏర్పాట్లపై గత రెండు నెలలుగా కసరత్తు చేసిన పోలీసులు.. కేవలం హుస్సేన్ సాగర్ చుట్టూ 3 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది హుస్సేన్‌సా గర్‌లో 25 వేల నుంచి 30 వేల విగ్రహాలు నిమజ్జనమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఖైరతాబాద్ గణేశుడి విగ్రహాన్ని మధ్యాహ్నం 1.30 గంటలలోపు నిమజ్జనం చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బాలాపుర్ వినాయకుడు హుస్సేన్ సాగర్ దగ్గరికి చేరుకునే అవకాశముంది. మహిళల భద్రతకు షీటీమ్స్‌ను రంగంలోకి దించుతున్నారు. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లోనే 12 షీటీమ్స్ పహారా కాయను న్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం రాత్రి 11 గంటల వరకు భారీ వాహనాలను, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను కూడా నగరంలోని అనుమతించరు. నిమజ్జన సమయంలో నగర వ్యాప్తంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మొత్తం 67 డైవర్షన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్రజలంతా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వినియోగిస్తే నిమజ్జనం ప్రశాంతంగా వీక్షించవచ్చని పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ హెల్ప్ లైన్ నంబర్లు 9010203626, 8712660600, 040-27852482 కి ఫోన్ చేయొచ్చని తెలిపారు.

**ఖైరతాబాద్ గణపతి శోభాయాత్ర :** మంగళవారం ఉదయం 6.30గంటలకు ఖైరతాబాద్ గణపతి శోభాయాత్ర ప్రారంభం కానుంది. ఇక్కడ 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

శోభాయాత్ర మార్గంలో 56 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు రహదారిపై ఉన్న సీసీటీవీ కెమెరాలతోనూ భద్రతను పర్యవేక్షించనున్నారు.

**9 గంటలకు బాలాపూర్ వినాయకుడి శోభాయాత్ర :** బాలాపూర్ వినాయకుడి వద్ద 220 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు.

30 సీసీటీవీ కెమెరాలతో రాచకొండ పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. వేలంపాట అనంతరం ఉదయం 9 గంటల సమయంలో శోభాయాత్ర ప్రారంభం కానుంది. 16కి.మీ ప్రయాణం అనంతరం ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకోనుంది.




## రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై కొందరు చిల్లరగా మాట్లాడుతున్నారు

హైదరాబాద్: దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయం ఎదుట ఈరోజు ఏర్పాటు చేశారు. రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై కొందరు చిల్లరగా మాట్లాడుతున్నారని అన్నారు. రాజీవ్ త్యాగం గురించి కొందరికి తెలియజేయాలని చెప్పారు. గాంధీ కుటుంబం దేశం కోసం సర్వం త్యాగం చేసిందని కొనియాడారు. స్వాతంత్ర్యం కోసం జైల్లో మగ్గిన చరిత్ర నెహ్రూదని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఐక్యంగా ఉంచిన నేత నెహ్రూ అని ప్రశంసించారు. తొలి ప్రధానిగా దేశాన్ని నెహ్రూ ఐక్యంగా నడిపించారని తెలిపారు. నెహ్రూ నేతృత్వంలో సర్దార్ వల్లభాయ్ పటేల్హోంమంత్రిగా పనిచేశారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**అక్టోబర్‌లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు: ఉత్తమ్** ... కొత్త రేషన్ కార్డులకు అక్టోబర్ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రేషన్‌కార్డుల జారీపై వేసిన మంత్రివర్గ ఉపసంఘం కమిటీ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని చెప్పారు.

కొత్తగా రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు విడివిడిగా అందజేస్తామన్నారు. రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన తుది ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి చేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు ఇస్తామని తెలిపారు.



# తెలుగు రాష్ట్రాలకు కేంద్ర నిధులు

# అంతా చంద్రబాబు పుణ్యమే!

## ఎన్‌డిఏలో టిడిపికి క్రియాశీలక గుర్తింపుతో ఆంధ్రాతో పాటు తెలంగాణకు బెనిఫిట్స్!!

హైదరాబాద్ / అమరావతి : ఎన్డీయేలో టీడీపీ భాగస్వామిగా ఉండటంతో ఏపీకి ఎంత ప్రయోజనమో, తెలంగాణకూ అంతే మొత్తంలో కాకపోయినా కొంచెం అటు, ఇటుగా ప్రయోజనం జరుగుతోంది. ఏపీకి సాయం అందించి తెలంగాణకు సహకరించకపోతే విమర్శలు వస్తాయని ముందుచూపుతో తెలంగాణ పట్ల కూడా ఉదారంగా వ్యవహరిస్తోంది కేంద్రం. ఏపీకి మాత్రమే కేంద్రం వరాల జల్లు కురిపిస్తోందని.. తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపిస్తోందని గత కొద్ది రోజులుగా తెలంగాణ నేతల నుంచి పెదవి విరుపులు వివినిపిస్తూనే ఉన్నాయి. కాని, ఏపీకి తీపి కబురు ప్రకటించినప్పుడల్లా ఏదో ఒక సమయంలో తెలంగాణకు కూడా కేంద్రం సహకారం అందించాల్సిన అనివార్యత ఏర్పడుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన ఏపీతోపాటు తెలంగాణకు వరద సాయం ప్రకటించిన కేంద్రం తాజాగా మెడికల్ కాలేజ్ ల అనుమతుల విషయంలో గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీలో రెండు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లకు అనుమతులు ఇవ్వగా.. ఎప్పటి నుంచో తెలంగాణలో మెడికల్ కాలేజ్ లకు అనుమతి ఇవ్వాలని కోరగా తాజాగా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో మెడికల్ కాలేజ్ లకు అనుమతులు ఇవ్వాల్సి రావడంతోనో ఏమో, తెలంగాణలోనూ నాలుగింటికి కేంద్రం తాజాగా అనుమతులు ఇచ్చింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వైద్య విద్య మరింత మందికి చేరువ కానుంది. ఇలా.. ఏపీకి సహకారం అందించిన ప్రతిసారి కేంద్రం తెలంగాణ గురించి కూడా ఆలోచించాల్సి వస్తోంది. ఏపీకి మాత్రమే సహకారం అందించి తెలంగాణకు నిరాకరిస్తే విమర్శలు వస్తాయని.. ఏపీతో సమానంగా తెలంగాణను కేంద్రం ట్రీట్ చేయాల్సిన అనివార్యత ఏర్పడుతోంది. మొత్తానికి ఎన్డీయేలో టీడీపీ భాగస్వామిగా ఉండటంతో ఏపీతోపాటు తెలంగాణ కూడా ప్రయోజనం పొందుతుందని స్పష్టం అవుతోంది.

## సంపాదకీయం

# నవంబరులో 3 విపక్ష రాష్ట్రాల్లో ఎన్నికల మహా సమరం.. బీజేపీకి పరీక్షే!

ఓవైపు కశ్మీర్, హరియాణా ఎన్నికల హంగామా ముగుస్తుండగానే.. మరోవైపు మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా అత్తెసరు మెజారిటీతో గెలిచిన బీజేపీకి ఇవి కఠిన పరీక్ష పెట్టబోతున్నాయి. ఎందుకంటే సరిగ్గా రెండు నెలల్లో మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇవన్నీ విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలే కావడం గమనార్హం. మొన్నటివరకు హరియాణా, మహారాష్ట్ర, కశ్మీర్ ఎన్నికలు కలిపి నిర్వహిస్తారని భావించారు.

కానీ, వర్షాలు- వరదలను కారణంగా చూపుతూ ఆ రాష్ట్రంలో ఎన్నికల తేదీలు ప్రకటించలేదు. హరియాణా, కశ్మీర్ లో ఈ నెల, వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్నాయి.

**మూడుకు మూడు కఠినమే :** ఇప్పుడు రెండు రోజుల్లో ఢిల్లీ సీఎంగా రాజీనామా చేస్తానని కేజ్రీవాల్ ప్రకటించిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికీ ఎన్నికల నిర్వహణ అనివార్యం కానుంది. వాస్తవానికి ఢిల్లీ శాసనసభకు ఫిబ్రవరి వరకు గడువుంది. అయితే, కేజ్రీ రాజీనామాతో ఎన్నికలు తప్పనిసరి అయ్యాయి.

అయితే, జార్ఖండ్, మహారాష్ట్రతో పాటే ఢిల్లీకీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావించినట్లు కథనాలు వచ్చాయి. వారు అలా అనుకున్నా.. కేజ్రీ రాజీనామా కూడా కలిసొచ్చింది. 2015 నుంచి ఢిల్లీలో కేజ్రీవాలే అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఓ విధంగా నరేంద్రమోదీకి గొంతులో పచ్చి వెలక్కాయ లాగా మారిన ఆయనను మద్యం కేసులో జైలుకు పంపింది కేంద్ర ప్రభుత్వం.

**కొరుకుడుపడని జార్ఖండ్ :** జార్ఖండ్ కు 2019 డిసెంబరులో ఎన్నికలు జరిగాయి. ఇక్కడ హేమంత్ సోరెన్ సారథ్యంలోని జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వాన్ని బీజేపీ నానా తిప్పులు పెట్టింది. హేమంత్ ను కూడా జైలుకు పంపింది. అయితే, ఈయన రాజీనామా చేసి తన స్థానంలో చంపయీ సోరెన్ కు అవకాశం ఇచ్చారు. హేమంత్ బయటకు వచ్చాక దిగిపోయిన ఈయన.. బీజేపీలో చేరడం కొసమెరుపు. డిసెంబరులో జరగాల్సిన ఎన్నికలను నవంబరులో మహారాష్ట్ర-ఢిల్లీతో కలిపి చేపట్టే వీలుంది.

**మహా సమరమే..** గత ఐదేళ్లలో ఏ రాష్ట్రంలోనూ జరగని రాజకీయ మార్పులు దేశంలోని పెద్ద రాష్ట్రమైన మహారాష్ట్రలో జరిగాయి. తొలుత బీజేపీ-శివసేన కూటమిలో చేరిన ఎన్సీపీ అజిత్ పవార్.. రోజుల్లోనే వెనక్కు వచ్చేశారు. కాంగ్రెస్-శివసేన (ఉద్ధవ్)-ఎన్సీపీ కూటమి సర్కారు ఉద్ధవ్ సారథ్యంలో కొన్నాళ్లు కొనసాగింది. అయితే, శివసేన ఏక్ నాథ్ శిందే ద్వారా చీల్చిన బీజేపీ ఆయననే సీఎంను చేసింది. మరొక్క ఏడాదిలోనే ఎన్సీపీని అజిత్ పవార్ ద్వారా చీల్చింది. అజిత్ నూ అధికారంలో భాగం చేసింది. మహారాష్ట్రలో 2019లో అక్టోబరు 21న ఎన్నికలు జరిగాయి. ఈ లెక్కన ఈ రాష్ట్రంలోనూ హరియాణా, కశ్మీర్ తో పాటే ఎన్నికలు జరపాలి. కానీ.. ఎన్నికల సంఘం మాత్రం నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు జార్ఖండ్, ఢిల్లీతో పాటు మహారాష్ట్రకు నవంబరులో ఎన్నికలు జరిపే చాన్సుంది. ఇదంతా అంచనా మాత్రమే. ఎన్నికల సంఘం నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి. వీటిలో గెలవడం మాత్రం బీజేపీకి, ప్రధాని మోదీకి చాలా ప్రతిష్ఠాత్మకం. గెలుపు అవకాశాలు మాత్రం కనిపించడం లేదనేది విశ్లేషకుల అభిప్రాయం.

# ఇంటర్నేషనల్ లైఫ్‌సైన్సెస్ స్వేర్ తో కొత్త శకానికి నాంది పలకనున్న జీనోమ్ వ్యాలీ : శ్రీధర్ బాబు





శామీర్ పేట, (గరుడ వార్త) : ఇంటర్నేషనల్ లైఫ్‌సైన్సెస్ స్వేర్ (హెచ్ఐఎల్ఎస్) తో లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌లో జీనం వ్యాలీ ఒక కొత్త శకానికి నాంది పలకనుందని తెలంగాణ ఐటీ అండ్ పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మూడు చింతలపల్లి మండలం కొల్తూరు పరిధిలోని ఐకెపి నాలెడ్జ్ పార్క్ లో నూతనంగా ఏర్పాటు చేసిన లారస్ ల్యాబ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ప్రపంచంలోనే మొట్టమొదటి ఐయఫ్‌సి-ఈడిజిఈ (ఎక్సలెన్సీ ఇన్ డిజైన్ ఫర్ గ్రేటర్ ఎఫీషియన్స్) కల్గిన అధునాతన సర్టిఫైడ్ లైఫ్ సైన్సెస్ సదుపయం 3జివి ని ప్రారంభించిందన్నారు. లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణలు వాటి వృద్ధికి ప్రధాన కేంద్రమైన జీనోమ్ వ్యాలీ, ఈ రంగాన్ని అభివృద్ధి చేయడంలో రాష్ట్ర నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోందని తెలిపారు. ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ యాజమాన్యంలో 3జివి రూ.105 కోట్ల పెట్టుబడితో అన్ని సౌకర్యంతో 1,50,000 చదరపు అడుగుల స్థిరమైన మౌలిక సదుపాయాలతో 1,000 మందికి పైగా ఆతిథ్యం ఇస్తుందని చెప్పారు. ఈ సౌకర్యం అన్ని పరిమాణాల కంపెనీల కోసం రూపొందించబడిందని, అధునాతన ల్యాబ్ స్థలాలతో పర్యావరణ బాధ్యతను స్పష్టంగా చూపుతుందన్నారు. హెచ్ఐఎల్ఎస్ అత్యాధునిక సౌకర్యాలు, ప్రపంచ సహకారాన్ని పెంపొందించడానికి సిద్ధంగా ఉందని, హైదరాబాద్ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ రంగంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందన్నారు. లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌లో కొత్త శకానికి నాంది పలుకుతున్న జీనోమ్ వ్యాలీ మన ఆశయాలకు నాంది పలుకుతోందని, ఇది అంతర్జాతీయ దిగ్గజాలకు, డ్రైవింగ్ ఆవిష్కరణకు, సహకారానికి లాంచ్‌ప్యాడ్ అవుతుందని చెప్పారు. ఈ అత్యాధునిక సౌకర్యాలు కేవలం మౌలిక సదుపాయాలను నిర్మించడమే కాకుండా తెలంగాణ లైఫ్ సైన్సెస్‌లో అగ్రగామిగా నిలిచి భవిష్యత్తును సృష్టించడంతోపాటు ప్రఖ్యాత అంతర్జాతీయ కంపెనీల నుంచి కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్ ప్రాజెక్ట్‌ల కోసం ఈడిజిఈ నెట్ జీరో సర్టిఫికేషన్‌లను సాధించడంలో కంపెనీ నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. అనంతరం ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ గోయెల్ మాట్లాడుతూ హైదరాబాద్ ఇంటర్నేషనల్ లైఫ్‌సైన్సెస్ స్వేర్ (హెచ్ఐఎల్ఎస్)లో కంపెనీ పాత్ర కీలకమైంది అన్నారు. హెచ్ఐఎల్ఎస్ ద్వారా శాస్త్రీయ సమాజాల కోసం చక్కటి సౌకర్యాలతో కూడిన స్థలాలను అందించడానికి, ఆవిష్కరణల కోసం సహకార పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి మేము నిబద్ధతగా ఉన్నామని పునరుద్ఘాటించారు. మా లక్ష్యం లైఫ్ సైన్సెస్ పరిశోధన, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే వాతావరణాలను సృష్టించడం, ప్రపంచ స్థాయిలో సంచలనాత్మక పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. కాగా జీనోమ్ వ్యాలీ కనెక్ట్ 2024 ఈవెంట్‌లో భాగమైన విజన్ ఫోరమ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబు సైనోపోలిస్‌ను సందర్శించారు. అక్కడ 50-60 మంది ప్రముఖ పరిశ్రమల ప్రముఖులతో సమావేశమయ్యారు. జీనోమ్ వ్యాలీ యొక్క భవిష్యత్తును రూపొందించడానికి వారు చేస్తున్న ఆవిష్కరణ, అవకాశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా, జీనోమ్ వ్యాలీ ఫేజ్ 2లో 300 ఎకరాల అంతర్జాతీయ లైఫ్ సైన్సెస్ కారిడార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ లైఫ్ సైన్సెస్ స్వేర్ (హెచ్ఐఎల్ఎస్) బ్లూప్రింట్, లోగోను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వజ్రాష్ యాదవ్, డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. -2

# ప్రభుత్వ భూమిని సత్వరం సర్వే చేస్తేనే గీతా కార్మికులకు న్యాయం కలుగుతుంది: గీతా కార్మిక సంఘం డిమాండ్





శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ భూమిని సత్వరం సర్వే చేపడితేనే గీత కార్మికులకు న్యాయం కలుగుతుందని, గీతా కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి జి సాయిల్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మూడుచింతలపల్లి మండలం, అద్రాస్ పల్లి గ్రామంలో తాటి, ఈత వనాలు పెంచిన ప్రభుత్వ స్థలాన్ని గీత కార్మికుల సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిజి సాయిల్ గౌడ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా అద్రాస్ పల్లి గ్రామానికి చెందిన గీత కార్మికులు ప్రభుత్వ భూమిలో తాటి, ఈత, వనాన్ని పెంచుకొని అనేక సంవత్సరాలుగా పొజిషన్లో ఉన్నారని, ఈ మధ్యకాలంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆ భూమిపై హక్కు మాది అని గీత కార్మికులను ఇబ్బంది పాలు చేస్తున్నారన్నారు. అట్టి చర్యలను గీత పని వాళ్ళ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సర్వే నెంబర్ 172, 173/1లోని ప్రభుత్వ భూములు తక్షణమే సర్వే జరిపించి, గీత కార్మికులకు న్యాయం చేకూర్చాలన్నారు.గత మూడు సంవత్సరాలుగా బోర్లు వేసి, డ్రిప్ పద్ధతిలో చెట్లకు నీరు అందిస్తున్నట్లు చెప్పారు. పది పదిహేను తాటి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని చెప్పారు. అదేవిధంగా 560 జీవో ప్రకారం వన పెంపకానికి 10 ఎకరాల భూమి కేటాయించాలని రాష్ట్ర సంఘం తరఫున అనేక పర్యాయములు రెవెన్యూ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అద్రాస్ పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి సుమారు 20 ఎకరాల వరకు సర్వేనెంబర్ 172. %&% 173/1లలో ఉన్నదని, అందులోనే గీత కార్మికులు ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకే వన పెంపకం చేసినట్లు చెప్పారు. వెంటనే ప్రభుత్వం ఈ భూమిని సర్వే చేసి గీత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటింగ్ జనరల్ సెక్రటరీ బి. నాగభూషణం, జిల్లా గీత పని వారల సంఘం ప్రధాన కార్యదర్శి టి.యాదయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి డి జి నరేందర్ ప్రసాద్, అద్రాస్ పల్లి అధ్యక్షుడు రంగ నగేష్ గౌడ్, గీతా కార్మికులు గంగల వీరస్వామి గౌడ్, రంగ వెంకటేష్ గౌడ్, రంగ భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# శామీర్పేట పోలీస్ తో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా కొనసాగుతున్న బొజ్జ గణపయ్య నిమజ్జనాలు



శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్పేట పోలీసులతోపాటు, ఇతర సంబంధిత అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా బొజ్జ గణపయ్య నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. శామీర్ పేట పెద్ద చెరువులో గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద ఎత్తున గణనాథులను తీసుకువచ్చి నిమజ్జనాలు గావించారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన నిమజ్జనానికి గణనాధులను ఎంతో ఉత్సాహంగా తీసుకువచ్చి నిమజ్జనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నిమజ్జనాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, శామీర్ పేట విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడిఈ రమణారెడ్డి ఏఈ సురేందర్లు నిమజ్జనాలను పర్యవేక్షించారు.

# గ్రేటర్ సమగ్ర అభివృద్ధికి 'హైసిటీ'

హైదరాబాద్: బల్దియా పరిధిలో మౌలిక వసతుల కల్పనకు సరికొత్త పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా నగరాన్ని అంతర్జాతీయ సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. గ్రేటర్ హైదరాబాద్‌లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా దీనిని తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో వివిధ వ్యూహాత్మక పథకాల పేరుతో గ్రేటర్ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించారు. ఇందులో భాగంగా ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ తదితర వాటిని నెలకొల్పారు. ఈ పథకాల్లో భాగంగా చేపట్టిన కొన్ని పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వీటిని పూర్తి చేయడం, నూతన పనులను ప్రతిపాదిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రాధాన్య మౌలిక వసతులను కల్పించేందుకు 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్



ట్రాన్స్‌ఫార్మేటివ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్' (హైసిటీ) పేరుతో సరికొత్త పథకాన్ని అందుబాటులో తెచ్చారు. గతంలో చేపట్టిన పనులు పూర్తవ్వడానికి కావాల్సిన నిధులు.. తాజాగా పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం బల్దియా అధికారులను ఆదేశించింది. గతంలో గ్రేటర్‌లో 42 పనులు ప్రతిపాదించగా అందులో 35 పనులు పూర్తయ్యాయి. మరో 7 పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నాయి. ఎస్ఎన్‌డీపీ ద్వారా గ్రేటర్, దానికి ఆనుకొని ఉన్న మున్సిపాలిటీల్లో మొత్తం 58 పనులు చేపట్టారు. అందులో 39 పనులు పూర్తి చేశారు. మొత్తం 69.49 కిలోమీటర్ల పొడవునా నాలాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 42.48 కిలోమీటర్ల మేరకు పూర్తిచేశారు. నాలాల అభివృద్ధికి (ఎస్ఎన్‌డీపీ) హైసిటీ పథకంలో భాగంగా రూ.582.42 కోట్ల అంచనాతో 35 పనులు తాజాగా చేపట్టనున్నారు.

# అందని బిల్లులు.. చేసేదెలా పనులు!

పెద్దపల్లి : చిత్రంలో కనిపిస్తోంది ఎలిగేడు మండలకేంద్రంలో తాగునీటి పైపులైన్ గేటువాల్వు. లీకేజీ మరమ్మతు కోసం గొయ్యి తవ్వారు. పనులు పూర్తయ్యాక కొత్త గేట్‌వాల్వ్ బిగించడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలిగాయి.గత వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. పల్లెల్లో మూలన పడిన చేతిపంపులు, బోరు మోటార్లు, బావులు, పగుళ్లు బారిన పడిన పైపులైన్లకు మరమ్మతు చేసేందుకు 'ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్' పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు దగ్గరుండి పనులు చేయించడంతో తాగునీటి సమస్య తొలగింది. అక్కడివరకు బాగానే ఉన్నా పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదు. గతంలో చేసిన పనుల్లో మళ్లీ లీకేజీలు ఏర్పడుతుండటంతో కలుషిత నీటి కష్టాలు తప్పడం లేదు.

171 పనులు.. రూ.1.83 కోట్లు

జిల్లాలోని 266 పంచాయతీల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా మొత్తం 1,47,579 కనెక్షన్లున్నాయి. జిల్లావ్యాప్తంగా 171 పనులకు రూ.1.83 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పైపులైన్ల లీకేజీని అరికట్టడంతో పాటు వృథాగా ఉన్న చేతిపంపులను వినియోగంలోకి తీసుకొచ్చారు. తాగునీటి బావుల్లో పూడిక తొలగించారు. పాడయిన మోటార్లకు మరమ్మతు చేశారు. కొన్ని చోట్ల బోర్లను అద్దెకు తీసుకున్నారు. జిల్లా అధికారుల ఆదేశాలతో గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు చేయడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పాయి.

నిధుల కోసం వెదుకులాట

మూడు నెలల కిందట పనులు హడావుడిగా చేయడంతో లీకేజీ సమస్య మళ్లీ ఎదురవుతోంది. వానాకాలంలో లీకేజీలతో తాగునీరు



కలుషితమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చేతిపంపులు మొరాయిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అనుమతి లేకుండానే పనులు చేశారు. దీంతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. బిల్లుల చెల్లింపు లేక నిధుల కోసం వెదుక్కోవాల్సి వస్తోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నయా పైసా రాలేదు

ధర్మారం: ఖిలావనపర్తిలో ఓఅండ్‌ఎం కింద అయిదు బోరుబావులను రూ.50 వేలకు పైగా వెచ్చించి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మరమ్మతు చేయించారు. పనులు పూర్తి చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ నయా పైసా రాలేదు. ఒక్క ఖిలావనపర్తే కాదు, మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. తాను రూ.1.20 లక్షలు ఖర్చు చేశానని, ఇప్పటికీ బిల్లులు రాలేదని మరో గ్రామ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా పంచాయతీ కార్యదర్శులకు బదిలీల ప్రక్రియ మొదలవనుండగా స్థాన చలనం కలిగితే పెట్టిన ఖర్చులు వస్తాయో లేదోనని కార్యదర్శులు వాపోతున్నారు.

అయిదు గ్రామాల్లో అప్పు తెచ్చి పనులు

ఓఅండ్‌ఎం(ఆపరేషనల్ మెయింటెనెన్స్) పథకం ద్వారా మండలంలోని పెద్దంపేట, ఇద్లాపూర్, మడిపల్లికాలనీ, అంకంపల్లి, చిన్నరాతుపల్లి గ్రామాలను ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేశారు. అయిదు గ్రామాల్లో అధికారులు అప్పు తెచ్చి మోటార్లు, పైపులైన్లు వేసి తాగునీరు సరఫరా చేయగా ఇప్పటివరకు బిల్లులు రాలేదని అధికారులు తెలిపారు.

## అర్జీలు కనిపించక అయోమయం

కరీంనగర్ : అనధికార ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుదారుల్లో గందరగోళం నెలకొంది. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ముందుగానే వడబోస్తుండటంతో అత్యధిక శాతం అర్జీలు కనిపించడం లేదు. ఇంతకీ ఆ దరఖాస్తులు ఏమైనట్టో ఏ అధికారి చెప్పలేకపోతున్నారు. పూర్తి వివరాలతో కథనం.

నాలుగేళ్ల కిందట వెయ్యితో నమోదు..

జిల్లాలోని పురపాలికలు, నగరపాలక, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ, గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 68,405 దరఖాస్తులు వచ్చాయి. వీటిని 2020 అక్టోబరు 31 వరకు స్వీకరించారు. ఆ సమయంలో ఎలాంటి పత్రాలు లేకుండానే ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండగా మళ్లీ వాటిని పరిష్కరించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. మూడు దశల్లో పరిశీలించేలా వెబ్‌సైట్ ద్వారా, చరవాణి అర్జీలతో అధికారులకు అధికారం ఇచ్చారు. పరిశీలన సమయంలో దరఖాస్తులు ఎక్కువగా కనిపించకపోవడంతో అయోమయం నెలకొంది.

ఒకరు చూస్తే మరొకరికి కనిపించదు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో క్రమబద్ధీకరణకు వచ్చిన ప్లాట్ల వివరాలను తెలుసుకోవడానికి మూడు దశల్లో అధికారులకు అవకాశమిచ్చారు. ఎల్-1లో పట్టణ ప్రణాళిక అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటి పారుదల శాఖ అధికారులకు.. ఎల్-2లో పట్టణ ప్రణాళిక ఏసీపీ స్థాయి అధికారి, డీటీసీపీ, సీపీవోలు.. ఎల్-3లో కమిషనర్లకు, పంచాయతీ అధికారులకు అనుమతులు ఇవ్వడానికి వీలుంది. ఇందులో ఏ ఒక్క అధికారి దరఖాస్తు తెరిచి చూసినా.. తిరిగి మిగతా అధికారుల లాగిన్‌లో కనిపించడంలేదు.

దరఖాస్తుదారుల ఆగ్రహం

స్థలాలు క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకొస్తున్న దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా అర్జీలను సుపరిపాలన కేంద్రం (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ముందస్తుగా పరిశీలించి.. వివిధ నిబంధనల ఆధారంగా వడపోస్తుంది.



ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని చరవాణికి సంక్షిప్త సమాచారం వస్తుండటంతో.. అది చూసిన అర్హులైన వారు ఇళ్లు నిర్మించుకున్న చోట నిషేధిత జాబితా ప్లాటు ఉండటం ఏంటని ఆందోళన చెందుతున్నారు.

సర్వే నంబర్ మీద ఎక్కడో ఇబ్బందులుంటే అందరిపై వర్తింపజేయడంపై దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా ఎల్ఆర్ఎస్ కావాలంటే ఏం చేయాలో తోచక గందరగోళానికి గురవుతున్నారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి

క్రమబద్ధీకరణకు ముందుకొస్తే దరఖాస్తులే కనిపించడం లేదంటున్నారు. సులువుగా త్వరగా పరిష్కరించాల్సింది పోయి లేనిపోని సమస్యలు కారణంగా చూపుతున్నారు. ఎంతో మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.
అశోక్, కరీంనగర్

ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

ఎల్ఆర్ఎస్‌లో వస్తున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయిలో చేరవేసి పరిష్కరిస్తున్నాం. నిషేధిత జాబితాలో ఉన్న వాటిని కనిపించకుండా పెట్టారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. ఎ.ఆంజనేయులు, నోడల్ అధికారి,కరీంనగర్

## హక్కు దక్కక ఆందోళన

జహీరాబాద్: జహీరాబాద్ మండలం సత్వార్‌కు చెందిన దేశ్‌ముఖ్‌కు గ్రామంలోని 429, 430, 471 సర్వే నంబర్లలో 40 ఎకరాల భూమి ఉంది. ఆయన మరణించడంతో ఆ భూమిని ముగ్గురు కుమారుల పేర్లపైకి మార్చారు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన పాసు పుస్తకాలు వారికి ఇవ్వకపోగా.. మీ భూమి వక్ఫ్ పరిధిలో ఉందని అధికారులు సమాధానమిచ్చారు. పాసు పుస్తకాలు లేకపోవడంతో రైతులకు ప్రభుత్వ నుంచి ఎలాంటి ఆర్థికసాయం అందడం లేదు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిపై హక్కులు దక్కక ఆందోళన చెందుతున్నారు. ఇది ఈ ఒక్క రైతు సమస్య మాత్రమే కాదు. 2001లో వక్ఫ్ బోర్డు విడుదల చేసిన గెజిట్‌తో జహీరాబాద్ డివిజన్‌లోని 2,500 మంది రైతులను ఈ సమస్య వెంటాడుతోంది.

ఇదీ సమస్య

1954, 1995 సంవత్సరాల్లో అమలులోకి వచ్చిన వక్ఫ్ చట్టాలను ఆసరాగా చేసుకొని జహీరాబాద్ నియోజకవర్గంలోని 12,892 ఎకరాల భూములు తమవిగా పేర్కొంటూ వక్ఫ్‌బోర్డు 2001లో ఓ గెజిట్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం జహీరాబాద్ డివిజన్‌లో 2,500 మంది రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయారు. భూములు నిషేధిత జాబితాలో చేరడంతో భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు వీలులేదు. రైతు బంధు, రైతు బీమా తదితరాలు వర్తించవు. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ఉత్పత్తులను అమ్ముకోవడానికి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆందోళన బాట పట్టిన కర్షకులు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వలేదు
- మల్లేశం, ఖాశీంపూర్

వారసత్వంగా సంక్రమించిన 3 ఎకరాలను వక్ఫ్ భూమిగా పేర్కొంటు 2018 నుంచి నిషేధం విధించారు. పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. బ్యాంకులు రుణం ఇవ్వడం లేదు. రైతుబంధు నిలిచి పోయింది. న్యాయం చేయాలని ఐదేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.సాగుదారులుగానే మిగిలాం..- లక్ష్మీబాయి, సత్వార్ గ్రామం పూర్వీకుల నుంచి సంక్రమించిన 10 ఎకరాలపై నిషేధం విధించడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం. భూమిపై ఎలాంటి హక్కులేక పోవడంతో కేవలం సాగుదారులుగానే మిగిలాం. ప్రభుత్వాలు చొరవ చూపి నిషేధం ఎత్తివేసి, పాసు పుస్తకాలు ఇవ్వాలి.

# ముంపు బాధలు తీరేదెన్నడు..?



తాండూరు : తాండూరు డివిజన్లో భారీ వర్షం కురిస్తే మొత్తం 9 గ్రామాల్లో అంధకారం ఏర్పడుతోంది. వరద నేరుగా ఉపకేంద్రంలోకి చేరుతోంది. విలువైన ఉపకరణాలు నీట మునిగి దెబ్బతింటున్నాయి. వర్షాకాలంలో ఏటా ఇదే పరిస్థితి నెలకొంటోంది. వెరసి వేలాది మంది వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కథనం.

15 ఏళ్ల క్రితం ఏర్పాటు

తాండూరు మండలం గౌతాపూర్‌లో 15 ఏళ్ల క్రితం విద్యుత్ ఉపకేంద్రం నిర్మించారు. గౌతాపూర్, చెంగోల్, చింతామణిపట్నం, పర్వతాపూర్, గోపన్‌పల్లి, అల్లాపూర్, అంతారం, అంతారంతండా, దస్తగిరిపేటకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వేల సంఖ్యలో గృహాలకు, 400లకుపైగా నాపరాయి పరిశ్రమలకు, దుకాణ సముదాయాలకు, పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ పరిశ్రమలకు, కుటీర పరిశ్రమలు, వ్యవసాయనికి విద్యుత్ అందిస్తున్నారు. వీటన్నింటికి 24 గంటలు సరఫరాకు సర్కారు ఆదేశించింది. కానీ వర్షాకాలంలో సాధ్యపడటం లేదు. కారణమేమిటంటే భారీ వర్షాలు కురిస్తే వరదనీరంతా నేరుగా విద్యుత్ ఉపకేంద్రంలోకి చేరుతోంది. ఆపరేటర్ గదిలోకి, ఉపకేంద్రానికి వెళ్లే దారినిండా నడములోతు నీరు నిలుస్తుంది. దీంతో ఒక్కసారిగా విద్యుత్తు ఉపకరణాలు నీట మునిగి దెబ్బతింటున్నాయి. ఫలితంగా రోజుల తరబడి సరఫరా నిలిచిపోతోంది.

తొమ్మిది గ్రామాల్లో చీకట్లే..ఉపకేంద్రంలోకి వరదొస్తే ఏకంగా తొమ్మిది గ్రామాల్లో సరఫరా నిలిచిపోతోంది. ఈనెల ఒకటో తేదీన వరదతో ఉదయం 6గంటల ప్రాంతంలో సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు జిన్‌గుర్తి ఫీడరు, పట్టణంలోని ఉపకేంద్రం నుంచి సరఫరా చేయాల్సి వచ్చింది. రాత్రి 8గంటల ప్రాంతంలో సరఫరా పునరుద్ధరించారు. 14 గంటల పాటు సరఫరాలేకపోవడంతో తాగునీటి పథకాలు పని చేయక గ్రామస్థులు నానా పాట్లు పడ్డారు. నాపరాయి పరిశ్రమల్లో పనులు నిలిచిపోయి 3వేలకుపైగా కార్మికుల ఉపాధికి గండిపడింది. వరద ప్రభావంలేని ఎత్తు ప్రదేశంలో నిర్మిస్తే అంతరాయం లేకుండా మెరుగైన సరఫరాకు ఆస్కారం కలుగుతుంది.

కొత్తగా నిర్మిస్తే శాశ్వత పరిష్కారం
- వెంకటనాయుడు, ఏఈ, ట్రాన్స్‌కో, తాండూరు

గౌతాపూర్ ఉపకేంద్రాన్ని లోతట్టు ప్రదేశంలో నిర్మించినందున ఏటా వర్షాకాలంలో ముంపు సమస్య ఏర్పడుతోంది. తాత్కాలికంగా పక్క ఫీడర్‌ల నుంచి సరఫరా పునరుద్ధరించాల్సి వస్తోంది. సమస్య పరిష్కారానికి మట్టి వేసి ఎత్తు పెంచేందుకు మరమ్మతులు చేయాలి లేదంటే మరోచోట కొత్తగా ఉపకేంద్రాన్ని నిర్మించాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

## పారిశుద్ధ్యం మెరవాలి.. పల్లెలు మురవాలి!

కరీంనగర్ : పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పంచాయతీల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను ఈనెల 17 నుంచి నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ కాగా సిబ్బందితో సన్నాహక సమావేశాలు నిర్వహించారు.అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని గతేడాది భారత ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది 18 రోజులపాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మెరుగైన పారిశుద్ధ్యంతో స్వచ్ఛగ్రామాలుగా మార్చాలని భావిస్తున్నారు. పారదర్శకతతో పూర్తి స్థాయిలో ముందుకెళ్తేనే జిల్లాలో పారిశుద్ధ్య పనులు మెరుగుపడి అనుకున్న లక్ష్యం నెరవేరనుంది.

నామమాత్రం పనులు కాకుండా..

స్వచ్ఛతాహీ సేవలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలు సంపూర్ణంగా అమలు చేయాలి. కానీ అక్కడక్కడ కేవలం రహదారులపై చెత్తను ఊడ్చి, కాలువలో మురుగు తొలగింపు వంటి నిత్యం చేసే కార్యక్రమాలనే నిర్వహించి మమ అనిపించారనే ఆరోపణలున్నాయి.

ప్రారంభ రోజుల్లో హడావుడి చేసి.. తర్వాత వదిలేస్తున్నారని.. ఎక్కడ పారిశుద్ధ్య పనులు వంద శాతం పారదర్శకంగా జరగటం లేదనేది పల్లె జనాల మాట. సెగ్రిగేషన్ షెడ్లలో చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న పంచాయతీలను వేళ్లపైన లెక్కించవచ్చు. నిత్యం వినియోగిస్తున్న ప్లాస్టిక్, చెత్త అక్కడక్కడా రోడ్లపైన దర్శనమిస్తోంది. పైగా పక్షం రోజులు జరిగే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమానికి ప్రత్యేకించి నిధులు వెచ్చించకపోవటం, నిత్యం చేసే పనేగా అనే నిర్లక్ష్యం ప్రతికూల అంశంగా చెప్పవచ్చు.

రాష్ట్ర స్థాయి పురస్కారాలు..

గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తిమ్మాపూర్, రామడుగు మండలం వెలిచాల, గన్నేరువరం మండలం కాసింపేట గ్రామాలు జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికై, రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీలుగా పురస్కారాలు అందుకున్నాయి. జాతీయ స్థాయిలో రాణించలేకపోయాయి.

చేపట్టే కార్యక్రమాలు..

పంచాయతీ పాలకవర్గాలు, మండల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు శ్రమదానంతో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టడం.

ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కంపోస్ట్‌షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయడం.

ఒకసారి వినియోగించిన ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని అక్టోబరు 2న గ్రామ సభల్లో తీర్మానాలు చేయడం.

స్వచ్ఛత ప్రాధాన్యంపై విద్యాలయాల్లో, క్విజ్ పోటీల నిర్వహణ, విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం.

తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేయటం.

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, మురుగు తొలగింపు.

పర్యాటక ప్రదేశాల్లో సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేధం జరిగేలా చర్యలు.

పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ.

గ్రామస్థులు వస్త్ర సంచులు వినియోగించేలా అవగాహన కల్పించడం.

# ఆయుష్ పోయిండి!



గోదావరిఖని : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికపల్లి హోమియో ఆసుపత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు వినయకుమారి. ఈ కేంద్రం నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంతంలో హోమియో వైద్యంపై అవగాహన పెరిగి చుట్టుపక్కల గ్రామాల వారు వినియోగించుకుంటున్నారు. రోజు సుమారు 30 మంది రోగులు సేవలు పొందుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా వస్తారని వైద్యురాలు చెప్పారు. ఆరోగ్య ఉపకేంద్రం కోసం నిర్మించిన ఇరుకు భవనం కావడంతో కార్యకలాపాలకు ఇబ్బందిగా ఉంది.తిమ్మాపూర్‌లోని ప్రభుత్వ యునాని వైద్యశాల ఇది. ఇక్కడ పని చేస్తున్న వైద్యురాలు డా.ఫర్హానా ఖాతున్‌కు చిగురుమామిడి మండలం ఇందుర్తి కేంద్రం బాధ్యతలు అదనంగా అప్పగించడంతో అక్కడ మూడు రోజులు, ఇక్కడ మూడు రోజులు సేవలందిస్తున్నారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీలోని చిన్న గదిలో ఆయుష్ వైద్యశాల నిర్వహిస్తుండటంతో ఇరుకుగా ఉంది. వైద్యురాలు వచ్చిన రోజుల్లో సగటున 10 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు. పక్కా భవనం ఏర్పాటు చేసి వైద్యురాలు పూర్తి స్థాయిలో ఇక్కడే విధులు నిర్వహిస్తే జనం సేవలు ఉపయోగించుకునే అవకాశముంది.

కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ వైద్య విధానాలను ప్రోత్సహించాలని నిర్ణయించడంతో ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియో) మిషన్ కింద ఉమ్మడి జిల్లాలో పలు ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో కొన్ని చోట్ల వైద్యుల కొరత వెంటాడుతుండగా.. మరికొన్ని చోట్ల భవనాలు సరిగా లేవు.. దీంతో ఈ వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో జనం పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం లేదు. చాలా ఏళ్లుగా పని చేస్తున్న కేంద్రాలకు మాత్రం బాధితుల తాకిడి ఉండటం.. అవగాహన కల్పించి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే జనం సంప్రదాయ వైద్య విధానాలకు ఆసక్తి చూపిస్తారన్న విషయాన్ని తేటతెల్లం చేస్తోంది..

ఆదరణ తక్కువకు ఇవీ కారణాలు

ఆయుష్ ఆరోగ్య కేంద్రాలపై చాలా మందికి అవగాహన లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అల్లోపతి వైద్యం కోసం ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు తప్పితే ఆయుష్ కేంద్రాల వైపు చూడటం లేదు. దీంతో వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నా చాలాకాలంగా ఉన్న కేంద్రాలకు రద్దీ అధికంగా ఉండగా, కొత్తగా ఏర్పాటు చేసిన వాటికి లేకపోవడం గమనార్హం.

ఆయుష్ కేంద్రాల్లో వైద్యుల కొరత వెంటాడుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కేంద్రాలతోపాటు ఒప్పంద విధానంలో నిర్వహించే జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (ఎన్ఆర్‌హెచ్‌ఎం) కేంద్రాల్లోనూ పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. ఉమ్మడి జిల్లాలో 45 రెగ్యులర్, 32 ఎన్ఆర్‌హెచ్‌ఎం కేంద్రాలు ఉండగా 15 కేంద్రాల్లో వైద్యులు లేరు. ఉమ్మడి జిల్లాలో ఆయుష్ కేంద్రాలకు రోజుకు సగటున 1000 మంది వరకు మాత్రమే వచ్చి సేవలు పొందుతున్నారు.

కొన్ని కేంద్రాలకు పక్క జిల్లాల వైద్యులకు అదనపు బాధ్యతలు కేటాయిస్తున్నారు. ఒకే వైద్యుడు రెండు చోట్లా బాధ్యతలు నిర్వహించడం వల్ల ఎక్కడా పూర్తిస్థాయిలో సేవలందించే అవకాశం లేకుండా పోతోంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ఇదే విధంగా మిగతా కేంద్రాల్లో కూడా రోగుల సంఖ్య పెంచుకోవడానికి వైద్యాధికారులు ప్రయత్నిస్తే ఆయుష్ సంకల్పం నెరవేరుతుంది.

అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నాం : ఆయుష్ మిషన్ ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రాలపై గ్రామీణ ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని కేంద్రాల్లో రోగులు ఎక్కువగానే వస్తున్నారు. అన్ని కేంద్రాల్లో సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. వైద్యుల కొరత ఉన్న చోట మరో వైద్యుడికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నాం.
ప్రవీణ్‌కుమార్, ఆయుష్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కరీంనగర్ ఋ

## సమస్యలను గుర్తు పెట్టుకోండి!

గోదావరిఖని: ఆలస్యంగా అధికార పత్రాలు అందుకున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించేందుకు యాజమాన్యంతో చర్చించాలి. అవసరమైతే ఒత్తిడి తేవాలి. సింగరేణిలో రక్షణ చర్యలతో పాటు పని స్థలాల్లో కార్మికులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పదోన్నతులతో పాటు కార్మికుల సంక్షేమంపై కూడా మాట్లాడాలి. ముఖ్యంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు సంఘంతో నిర్మాణాత్మక, ప్రాతినిధ్య సంఘంతో జేసీసీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు డివిజన్‌ల వారిగా జీఎం స్థాయి నిర్మాణాత్మక సమావేశాలు ఉంటాయి. ఇందులో కార్మికుల సమస్యలకు పరిష్కారాలు వెతకాలి. ఏరియా స్థాయి సమస్యలపై అక్కడే పరిష్కారం చూపాలి. కార్పొరేట్ స్థాయి సమస్యలపై సీఎండీ, డైరెక్టర్‌ల స్థాయిలో నిర్వహించే సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉంది. ఈ అంశాలపై ఇరు సంఘాలు చొరవ తీసుకొని ముందుకు సాగాలి.

గతంలో ఊసే లేదు

నిర్మాణాత్మక సమావేశాల ఏర్పాటుకు గుర్తింపు సంఘం యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. గత గుర్తింపు సంఘం హయాంలో ఒకటి రెండుకు మించి నిర్మాణాత్మక సమావేశాలే నిర్వహించలేదు. ప్రాతినిధ్య సంఘాలతో జేసీసీ సమావేశాల ఊసు



కూడా లేదు. దీంతో ప్రభుత్వ చొరవతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించింది. కొన్నాళ్ల క్రితం మాత్రం నిర్మాణాత్మక సమావేశాల ద్వారానే కార్మికుల సమస్యలు తొలగేవి. తాజాగా గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నిర్మాణాత్మక, జేసీసీ సమావేశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్రధాన అంశాలుబొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికి కేటాయించే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి సంఘాలు కృషి చేయాలి.కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలి. కోల్ ఇండియాలో, సింగరేణి అధికారులకు ఇది అమలవుతోంది.

క్లరికల్, మైనింగ్, ట్రేడ్స్‌మెన్‌ల కేడర్‌స్కీం పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

సింగరేణి ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో లేక రోగులను కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ప్రత్యేక వైద్యులను నియమించుకోవడం ద్వారా ఈ సమస్య ఉండదు.

మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల వారసులలో కొంత మందిని విజిలెన్సు విచారణ పేరుతో ఉద్యోగాలు కల్పించకుండా పెండింగ్‌లో పెట్టారు. చాలా కాలంగా వారిని ఉద్యోగాల్లోకి తీసుకోకపోవడంతో వయో పరిమితి దాటిపోతుంది.

సింగరేణిలో కొంత మంది బినామీ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్నారు. దీంతో వారి ఇంటి వద్ద ఒక పేరు.. గనిలో మరో పేరు ఉండటంతో వారి పిల్లలకు ఇబ్బందిగా మారింది. వాటిని సవరించేందుకు చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాలి.

## నైపుణ్య పాటవం.. సాంకేతిక పథం

సిద్దిపేట : డిగ్రీ దశలోనే విద్యార్థులు సాంకేతిక పాఠాలు బోధించే స్థాయికి ఎదుగుతున్నారు. నైపుణ్యాలు పెంచుకుంటూ.. పాఠశాలల్లో పిల్లలకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ సంస్థ మూడేళ్ల కిందట సిద్దిపేట జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'రోబోటిక్స్ ఇన్ అకాడమీ' పేరిట శిక్షణకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా 7, 8, 9 తరగతుల విద్యార్థులకు రోబోటిక్స్ ఆధారిత ప్రయోగాల తీరును వివరించారు. దీన్ని నిరంతరాయంగా సాగించేందుకు సిద్దిపేటలోని స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు.. రిసోర్సుపర్సన్లుగా మారడం విశేషం. ఏటా తృతీయ సంవత్సర విద్యార్థులు కీలక భూమిక పోషిస్తుండగా.. ప్రథమ సంవత్సరం వారికి తర్ఫీదు ఇస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నారు.

పరస్పర ఒప్పందం..2021లో సోహం అకాడమీ, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. 2022లో ఇన్నోవేషన్ ప్రయోగశాలను అందుబాటులోకి తెచ్చారు. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సహా రోబోటిక్స్ సంబంధిత 80 కిట్లు అందించారు. సదరు అకాడమీ తరఫున ఇప్పటి వరకు మూడు విద్యా సంవత్సరాల్లో కళాశాలలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు రోబోటిక్స్‌లో వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. 2024-25లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు శిక్షణ తాజాగా పూర్తయింది. గడిచిన మూడేళ్లలో 200 మందికి పైగా డిగ్రీ విద్యార్థులు తర్ఫీదు పొందారు. వీరిలో 60 మంది రిసోర్సుపర్సన్లుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు శిక్షణ ఇచ్చారు.

బోధన అంశాలు..మారుతున్న సాంకేతిక యుగంలో రోబోటిక్స్ పాత్ర అసామాన్యం. ఇందుకు అనుగుణంగా బాలబాలికలకు సెన్సార్లు, చిన్నపాటి మోటార్లు, డిస్‌ప్లే తదితర వాటి పనితీరు చెబుతారు. బ్లింకింగ్ ఎల్ఈడీ, బటన్ కంట్రోల్డ్ ఎల్ఈడీ, ఐఆర్ రిసీవర్ - కంట్రోలర్, యాక్టివ్ బజర్, టచ్ సెన్సార్ కంట్రోల్డ్ ఎల్ఈడీ, స్మార్ట్ ఫ్యాన్, అన్ని రకాల ఎలక్ట్రానిక్స్‌పై ప్రయోగపూర్వకంగా వివరిస్తారు. నిర్దేశిత బడులకు ప్రాథమిక కిట్లతో పాటు అడ్వాన్సుడ్ కిట్లను అకాడమీ సమకూర్చుతోంది. అవే ప్రయోగాలకు ఉపయోగపడుతున్నాయి.

కృత్రిమ మేధ..రోబోటిక్స్ అంటే ఒక వస్తువు/ఉత్పత్తికి ఇంటలిజెన్సు (కృత్రిమ మేధస్సు) ఇవ్వడమే. వివిధ పరిశ్రమలు, వాహన, వస్తు ఇతర రంగాల్లో రోబోటిక్స్ సాంకేతికత పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తరహా శిక్షణ కొనసాగడం ఇక్కడ ప్రత్యేకం. పాఠశాలల్లో చురుగ్గా ఉండే విద్యార్థులతో రోబోటిక్స్ క్లబ్‌లు ఏర్పాటు చేశారు. దశల వారీగా తరగతులు జరుగుతున్నాయి. ఆర్పీలు, అకాడమీ ప్రతినిధులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ వేదికగా బోధిస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఇద్దరు నుంచి ముగ్గురు విద్యార్థుల బృందం రోబోటిక్స్‌పై శిక్షణ ఇస్తున్నారు.

ఏటా 15 పాఠశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌లో తర్ఫీదు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 25 పాఠశాలల్లో రోబోటిక్స్‌కు సంబంధించి తరగతులు నిర్వహించారు.చోట్ల ఆసక్తి ఉన్న 100 మందికి ఆయా అంశాలను నేర్పిస్తున్నారు. శిక్షణ పొందిన డిగ్రీ విద్యార్థుల్లో 30 మందికి పైగా ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాలు పొందారు. గత విద్యా సంవత్సరంలో ఇన్నోవేషన్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో చేపట్టిన రోబోటిక్స్ ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు 50 నమూనాలను ప్రదర్శించారు.

# నూతన ఒరవడి.. చేరువలో ప్రగతి

జగిత్యాల : రైతుల ఆదాయాన్ని పెంచేలా వ్యవసాయ రంగంలో కేంద్రం తలపెట్టిన ఏడు రకాల కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లాలోని కర్షకులకు పలువిధాలా మేలు కలగనుంది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించి, నిధులను కేటాయించిన కార్యక్రమాల అమలుతో కలిగే ప్రయోజనాలు ఇవి..

పాల ఉత్పాదకత పెంపు

ఉమ్మడి జిల్లాలో సాగుకు అనుబంధంగా దాదాపు 1.37 లక్షల మంది రైతులు పాడి పరిశ్రమను కొనసాగిస్తున్నా ఆశించిన ఫలితాలను పొందటం లేదు. పాడిలో ఉత్పాదకత పెంపు, పాలకు కనీస ధర చెల్లింపు, రాయితీపై మేలుజాతి పాడిపశువుల అందజేత, షెడ్లు, దాణా, గడ్డి విత్తనాలు, ఇతరత్రా సామగ్రిని రాయితీపై ఇవ్వటం, పశువైద్య సేవలను విస్తరించటం తదితరాలతో పాడి రైతులకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.కేవీకేలు బలోపేతం

దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాకో కృషివిజ్ఞాన కేంద్రం (కేవీకే)ను నెలకొల్పాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కేవీకేలను ఏర్పర్చనున్నారు. ఇప్పటికే జమ్మికుంటలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లాలో ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో కేవీకేలు పని చేస్తున్నాయి. అన్ని కేవీకేలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా, జిల్లాస్థాయి సమగ్ర వ్యవసాయ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించింది. కేవీకేల నిర్వహణ, జీత భత్యాలను కేంద్ర వ్యవసాయశాఖ భరిస్తుంది. ముున్ముందు కేవీకేల్లో వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ సమాచారం ఒకేచోట లభించి రైతులకు సేవలు మరింత చేరువవుతాయి.

పరిశోధనల విస్తరణ

పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంతోపాటు కరీంనగర్‌లో, పెద్దపల్లి జిల్లా కూనారంలో పరిశోధన స్థానాలున్నాయి. వీటిల్లో విత్తనాల రూపకల్పన, పంటల సరళి, యాజమాన్యం, నూతన సాంకేతికత రూపకల్పన పరిశోధనలను విస్తరించనున్నారు. కరీంనగర్‌లోని ఏరువాక కేంద్రం, వ్యవసాయ డిగ్రీ, వెటర్నరీ పాలిటెక్నిక్, జమ్మికుంట పాలిటెక్నిక్, కోరుట్ల వెటర్నరీ కళాశాల, పొలాసలోని వ్యవసాయ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలు, సిరిసిల్ల జిల్లాలోని వ్యవసాయ కళాశాల, పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లా ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలతో స్థానికంగా విద్య, సాగు విధానాల రూపకల్పన బలోపేతం కానుంది.

సాగులో శాస్త్రీయ విధానాలు

మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న వారికి పెట్టుబడి ఖర్చు పెరగటం, సగటు దిగుబడులు పెరగకపోవటంతో లాభసాటిగా ఉండటంలేదు. దీనికిగాను నూతన శాస్త్రీయ విధానాలవైపు రైతులకు మళ్లించనున్నారు. నాబార్డు ద్వారా ఆర్థిక సాయం అందించటం, ఆధునిక యంత్రాల వినియోగం, రాయితీపై పరికరాల సరఫరా, విత్తనశుద్ధి, సమగ్ర సస్యరక్షణ, సంఘటిత మార్కెటింగ్, ఉప ఉత్పత్తుల తయారీ తదితర అంశాలను ఆకళింపు చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు.

ఉద్యాన పంటల సుస్థిరత

ఉద్యాన పంటల్లో సుస్థిరత కార్యక్రమంలో భాగంగా ఉద్యానపైర్ల సాగుకు ప్రోత్సాహాన్ని ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాల్లో 1.95 లక్షల ఎకరాల్లో మామిడి, కూరగాయలు, మిరప, పసుపు, పండ్లు, పూలు తదితర ఉద్యాన పంటలు సాగులో ఉన్నా ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన శాస్త్రవేత్తల సేవలు అందుబాటులో లేక రైతులు నష్టపోతున్నందున ఈ లోటును సరిదిద్దేలా జిల్లాలో ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిఉంది.

సహజ వనరుల సంరక్షణ

ఉమ్మడి జిల్లా ప్రధానంగా వ్యవసాయాధారితం కాగా సహజ వనరులైన నేల, గాలి, నీటి సంరక్షణకు తగిన చర్యలను చేపట్టనున్నారు. సాలీనా కురుస్తున్న 973 మి.మీ. సగటు వర్షం కురుస్తున్నా 40 శాతం నీటిని కూడా నిల్వచేసే పరిస్థితి లేనందున వర్షపునీటి నిల్వను పెంచాలి. అన్ని వ్యవసాయ క్లస్టర్లలోని మినీ భూసార పరీక్ష కేంద్రాలను పనిచేసేలా చర్యలు తీసుకుని భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రసాయన ఎరువుల వాడకాన్ని నిర్దేశిస్తే నేల ఫలదత నిలబడుతుంది.

ఆవిష్కరణలకు అవకాశం

డిజిటల్ అగ్రిమిషన్ ద్వారా వాతావరణ మార్పులు, సాగులో నిత్యం ఆచరణీయ అంశాలు, పంటల ధరలు తదితరాలను శాస్త్రవేత్తలు, అధికారులు, పరిశోధన సంస్థల నుంచి నేరుగా రైతుల చరవాణులకు చేరవేయనున్నారు. ఆన్‌లైన్‌లోనూ పలు వెబ్‌సైట్ల ద్వారా రైతులు తెలుసుకునే అంశాలను పొందుపరచనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించాలి. పొలాస పరిశోధన స్థానం ఆవరణలోని అగ్రి ఇంక్యూబేషన్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తే యువ రైతుల ఉపాధికి, నూతన ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతుంది.

# ఆక్రమణలు.. అనర్థాలు

కోరుట్ల: అధికారుల అలసత్వం.. స్థిరాస్తి వ్యాపారుల ఆక్రమణలతో ఏటా కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. శాశ్వత పరిష్కార మార్గాలను చూపడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు. మద్దుల చెరువు, తాళ్ల చెరువు, కంచరకుంట మత్తడి కిందున్న కాలువలు(ఒర్రెలు) ఆక్రమణలకు గురయ్యాయి. 10-15 అడుగుల వెడల్పు ఉన్న కాలువలు కబ్జాకు గురయ్యాయి. కొన్నిచోట్ల కాలువలను పూడ్చివేసి రోడ్లుగా ఏర్పాటు చేయగా అభివృద్ధి పేరిట బల్దియా అధికారులు సిమెంట్ రోడ్లుగా మార్చారు. మరికొన్నిచోట్ల కాలువ మార్గాలనే మార్చి.. రెండు, మూడడుగుల వెడల్పుతో మురుగు కాలువలుగా నిర్మించారు. దీంతో వర్షాకాలంలో వరద రోడ్లపై పోటెత్తుతోంది. జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి ఆక్రమణలను తొలగించి వరదలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలోని రవీంద్రరోడ్ శివారులో తాళ్ల చెరువు ఉంది. అందులో ఎక్కువైన నీరు మత్తడి దూకి దాని కింద సుమారు 10-15 అడుగుల మేర ఉన్న కాలువ ద్వారా ఫుల్‌వాగులో కలిసేది. పట్టణం విస్తరించడంతో తాళ్ల చెరువు కింద కాలనీలు వెలిశాయి. దీంతో మత్తడి కిందున్న కాలువను అప్పటి పాలకులు పూడ్చివేసి సిమెంట్ రోడ్ నిర్మించారు. ఏటా వర్షాకాలంలో చెరువు మత్తడి దూకి రోజుల తరబడి వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోడ్డుపై ప్రవహించే వరద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది.

ముత్యాలవాడలో, పైప్రాంతంలో పలు కుంటలు ఉండటంతోపాటు ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నుంచి కంచరకుంటకు వెళ్లేందుకు గొలుసుకట్టు కాలువ ఉంది. ఈ కాలువ, కుంటల పరిసరాల్లోని సాగు భూముల్లో అప్పట్లో రైతులు వ్యవసాయం చేసేవారు. ఎక్కువైన నీరు వెళ్లేందుకు కాలువ ఉండేది. పట్టణం విస్తరించడంతో కుంటలు అంతరించిపోయాయి. కాలువలు ఆక్రమణలు గురయ్యాయి. కంచరకుంట గొలుసుకట్టు కాలువను ఆధునీకరించకపోవడంతో పై ప్రాంతాల నుంచి వచ్చే నీరు ముత్యాలవాడను ముంచెత్తుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంటుంది.

కోరుట్ల పట్టణం ప్రకాశం రోడ్‌లో మద్దుల చెరువు మత్తడి దూకిన నీరు వెళ్లేందుకు 10-15 అడుగుల వెడెల్పుతో కూడిన కాలువ (ఒర్రె) ఉండేది. స్థిరాస్తి వ్యాపారులు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. మరికొన్నిచోట్ల కాలువను పూడ్చివేసి రోడ్డును నిర్మించారు. బల్దియా అధికారులు అభివృద్ధి పేరిట ఆక్రమణలను పట్టించుకోకపోగా కేవలం 2-3 అడుగుల మేర మురుగు కాలువను నిర్మించి చేతులు దులుపుకొన్నారు. దీంతో పదేళ్లుగా నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రోడ్డుపై వరద ప్రవహిస్తుండగా స్థానికులు ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# అమీర్‌పేటకు కొత్త రూపు.. చేపట్టే మార్పులు, చేర్పులు ఇలా...



హైదరాబాద్: హైదరాబాద్ నుంచి అమెరికాలోని సిలికాన్ వ్యాలీ వరకు అమీర్‌పేట అంటే తెలియని వారుండరు. ఐటీ, కంప్యూటర్ సైన్సులో కోర్సులు నేర్చుకోవాలంటే ఇక్కడికి రావాల్సిందే. అనేక రకాల కోచింగ్ సెంటర్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, వసతి గృహాలు, కళాశాలలతో నిత్యం కళకళలాడే అమీర్‌పేట రోజు రోజుకు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంటోంది. వాహనాలపై రాకపోకలు సాగించే వారితోపాటు... షాపింగ్, కోచింగ్‌కు వచ్చే వారితో నిత్యం రద్దీగా ఉంటోంది. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవడం, రోడ్లపైకి చిరు వ్యాపారులు రావడంతో పాదచారులకు నడిచే మార్గాలు ఉండటం లేదు. దారులన్నీ ఆక్రమణలతో ఇరుకుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో అమీర్‌పేట చుట్టూ నలువైపులా కూడళ్లను అభివృద్ధి చేయడం.. వివిధ మార్పులు చేర్పులతో ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, టీజీఎస్ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఎండీఏలోని హుమ్మా కలిసి ఇందుకు శ్రీకారం చుడుతున్నాయి.

చేపట్టే మార్పులు, చేర్పులు ఇలా...

ప్రస్తుతం స్వర్ణజయంతి కార్యాలయం సమీపంలో ఉన్న బస్టాప్‌లో ఒకదానిని మెట్రో స్టేషన్ కిందకు మార్చనున్నారు. ప్రస్తుతం మెట్రో దిగిన ప్రయాణికులు మళ్లీ వెనక్కి వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది. బస్టాప్‌ను మెట్రో స్టేషన్ కిందకు మార్చడం ఊరట కలగనుంది. సత్యం థియేటర్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే వాహనాలకు ఫ్రీలెఫ్ట్‌తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక నుంచి ఫ్రీ లెఫ్ట్‌ను నియంత్రించేందుకు మ్యానువల్‌గా లేదా సిగ్నల్‌ను ఏర్పాటు చేయనున్నారు.

అమీర్‌పేట స్వర్ణజయంతి జంక్షన్‌లో నలువైపులా వాహనాలు అడ్డదిడ్డంగా దూసుకొస్తున్నాయి.సారథి స్టూడియో వైపు నుంచి వచ్చే వాహనాలు క్రమ పద్ధతిలో వెళ్లేలా ఇక్కడ ఐల్యాండ్‌ను అభివృద్ధి చేయనున్నారు.

అమీర్‌పేట నుంచి బేగంపేట వెళ్లే మెట్రో రహదారి కింద రోడ్డు స్థానిక వ్యాపారులతో పూర్తిగా కబ్జాకు గురైంది. నడిచే వెళ్లే వారికి ఫుట్‌పాత్ కనిపించడం లేదు. ఇక్కడ వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా సత్యం థియేటర్ ముందు భాగంలో ఖాళీ స్థలంలో కేటాయించనున్నారు. కనకదుర్గ ఆలయం జంక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థను తీసుకురానున్నారు.అమీర్‌పేట జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. కేఎల్ఎం మాల్ వద్ద ఫుట్‌ఓవర్ వంతెనను అందుబాటులోకి తేవడంతోపాటు పాదచారులకు సౌకర్యాలు కల్పించనున్నారు. పంజాగుట్ట శ్మశానం వద్ద స్టీల్ వంతెన ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

# వేచి చూడాల్సిందేనా..!



వికారాబాద్ : వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, వరదలతో జిల్లాలో మారుమూల తండాలోని పీహెచ్‌సీ నుంచి పట్టణంలోని జిల్లా ఆసుపత్రి వరకు రోగులతో నిండిపోతున్నాయి. అతిసారం, జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, దగ్గు, ఒంటినొప్పులు, మోకాళ్ల నొప్పులు, డెంగీ, టైఫాయిడ్ తదితర సమస్యలతో బాధపడుతున్నారు. వీరికి సేవలు అందించడంలో ఎక్కడా తగినంత మంది వైద్యులు లేరు. దీంతో తమవంతు వచ్చే వరకు అలాగే వేచి చూడటమో లేక ఫీజుల భారం భరిస్తూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడమో చేయాల్సి వస్తోంది. జిల్లాలో వైద్య విధాన పరిషత్తు, వైద్య శాఖ, ప్రభుత్వ మెడికల్ బోర్డు అధీనంలో ఆసుపత్రులున్నాయి. అన్ని చోట్ల సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాపంగా 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీలు) నిత్యం 2,300 నుంచి 4,500 మంది వరకు బయటి రోగులు వస్తుంటారు. వీరికి తగినట్లుగా వైద్యులు లేక గంటల తరబడి వేచి చూస్తున్నారు.

వికారాబాద్ జనరల్ ఆసుపత్రిలో మొత్తం 86 మంది డాక్టర్లకు కేవలం 56 మంది, అలాగే 203 మంది నర్సులకు 143 మంది మాత్రమే ఉన్నారు.తాండూరు జిల్లా ఆసుపత్రి ఎంతో కీలకమైంది. నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలతో పాటు పట్టణ పరిధి, సరిహదు రాష్ట్రం కర్ణాటక, పొరుగు నియోజకవర్గం కొడంగల్ నుంచి ఈ ఆస్పత్రికి రోజుకు 500 నుంచి 600 దాకా బయటి రోగులు వస్తుంటారు. సాధారణ రోగ నిర్ధరణ పరీక్షలు ఇక్కడే చేస్తున్నారు. థైరాయిడ్ వంటి కొన్ని ప్రత్యేక పరీక్షల కోసం మాత్రమే నమూనాలను హైదరాబాద్‌కు పంపిస్తున్నారు.

ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు

డివిజన్ పరిధిలోని పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలో ఉప కేంద్రాల్లో సిబ్బంది, మందుల కొరత వేధిస్తోంది. గ్రామాల్లో చాలా మంది తప్పనిసరై ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు అందిన మేర దోచుకుంటున్నారు.

మెరుగైన సేవలకు కృషి చేస్తున్నాం

డాక్టర్ పల్వన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్

జిల్లాలో సిబ్బంది కొరత అంతగా లేదు. అన్నిచోట్ల మెరుగైన వైద్యసేవలు లభించేలా కృషి చేస్తున్నాం. ప్రాథమిక, ఇతర ఆసుపత్రుల్లో ఎక్కడా మందుల కొరత లేదు. వర్షాకాలం వ్యాధుల విషయంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

కొరత లేకుండా చూస్తాం

- జీవరాజు, జిల్లా ఉప వైద్యాధికారి

ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావటంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో ఎక్కడా మందుల కొరత లేకుండా వెంటనే చర్యలు చేపడతాం. ముందే సంబంధిత అధికారులకు వివరాలు పెడుతున్నాం.

# స్కీములు.. స్కాములు

హైదరాబాద్ : కార్పొరేట్ సంస్థల తరహాలో కార్యాలయాలు, ఖరీదైన కార్లలో ప్రయాణం, రంగురంగుల బ్రోచర్లు, తీయని మాటలు, రోజుల వ్యవధిలో రూ.కోట్లలో వసూళ్లు... ఇదీ ప్రస్తుత నేరగాళ్ల తీరు. నగరంలో దోపిడీ, దొంగతనాలు సాధారణమవుతున్నాయి. వీటి స్థానంలో ఆర్థిక నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయి. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో ఆర్థిక నేరాలు, నమ్మకద్రోహం, చీటీల పేరుతో వసూళ్లు వంటి నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతిమంగా మధ్యతరగతి ప్రజలు బలైపోతున్నారు.

నగరంలో ఏటా 10 శాతం చొప్పున పెరుగుదల

నగరంలో ఏటా సగటున 10 శాతం కంటే ఎక్కువగా ఆర్థిక నేరాలు, చీటింగ్ వంటి కేసులు పెరుగుతున్నాయిముఖ్యంగా చీటీలు, పెట్టుబడులకు మూడింతలు లాభాలు, ముందు డిపాజిట్లు కడితే తర్వాత వడ్డీతో కలిపి చెల్లింపులు, భూములపై పెట్టుబడులు పెట్టాలని నమ్మించి మోసం చేస్తున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

గత మూడేళ్లలో నగరంలోని మూడు కమిషనరేట్లలో దోపిడీలు, దొంగతనాలు, సొత్తుకోసం హత్య వంటి అన్ని రకాల చోరీ కేసులు 9- 10 వేల మధ్య ఉన్నాయి.ఇదే సమయంలో ఆర్థిక నేరాల సగటు గణనీయంగా పెరుగుతోంది. హైదరాబాద్ ఆర్థిక నేరాల విభాగం



(ఈవోడబ్ల్యూ)లో 2022లో 949 కేసులు నమోదయ్యాయి. 2023లో అంతకుమించి నమోదయ్యాయి. సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో ఈ ఏడాది 65 వరకూ ఆర్థిక నేరాలు నమోదయ్యాయి. ఇవన్నీ రూ.75 లక్షల నుంచి రూ.40 కోట్ల వరకూ ఉన్నాయి.

ఇవీ జాగ్రత్తలు..

రూ.లక్షకు నెలకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించినప్పుడు.. ఇలాంటి వడ్డీ బ్యాంకులు ఎందుకు ఇవ్వలేకపోతున్నాయో గమనించాలి.

ఇంటి పక్కవారు, స్నేహితులు అధిక వడ్డీ ఇస్తామంటే మోసమే.

# నిధులు వాగుల పాలు

వేములవాడ: వాగులపై పైవంతెనలు లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు తాత్కాలిక రహదారులు కొట్టుకుపోతున్నాయి. ఫలితంగా రూ.లక్షల నిధులు వాగుల్లో కలుస్తున్నాయి. ప్రతి సంవత్సరం ప్రజాధనం వృథా అవుతున్నా పైవంతెనల నిర్మాణం చేపట్టక రవాణా కష్టాలు తీరడం లేదు.

వాగులు, ఒర్రెల వద్ద పైవంతెనలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ నిధులు మంజూరు కాక లక్షలాది రూపాయలు వెచ్చించి మొరం, మట్టితో తాత్కాలిక రోడ్లు వేస్తున్నారు. ఇందుకు కిలో మీటరు పొడవు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు మొరం మందాన్ని బట్టి ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చి కొట్టుకుపోయి నిధులు నీటి పాలవుతున్నాయి. అయినా నేతలు, అధికారులు పైవంతెనల నిర్మాణం చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్లు మొత్తం కొట్టుకుపోయి ప్రజల రవాణాకు ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల పైవంతెనల నిర్మాణ పనులు చేపట్టినా అవి పూర్తికాలేదు. వాటి దగ్గర వేసిన తాత్కాలిక రోడ్లు సైతం వరదకు నామరూపాల్లేకుండా పోయాయి.

వేములవాడ గ్రామీణ మండలంలోని హన్మాజీపేట నక్కవాగు వద్ద వంతెన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కాక పక్కనే వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఇటువైపు వెళ్లే బొల్లారం, లింగంపల్లి, మామిడిపల్లి తదితర గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వేములవాడ నుంచి బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి వైపు రోడ్డులో వంతెన పనులు చేపట్టినప్పటికీ అది పూర్తి కాలేదు. ఇక్కడ కూడా రోడ్డు వరదకు ఆనవాళ్లు లేకుండా పోయింది.

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి- నిజామాబాద్ గ్రామాల మధ్య, ఇదే విధంగా బావుసాయిపేట- వెంకట్రావ్‌పేట మధ్య మూలవాగు ఉధృతంగా పారడంతో తుడిచిపెట్టుకుపోయాయి. వట్టిమల్ల- నిమ్మపల్లి గ్రామాల మధ్య కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చందుర్తి మండలంలోని మర్రిగడ్డ- సనుగుల, కోనరావుపేట మండలంలోని కొండాపూర్, జవహరిపేట- నర్సక్కపేట, రుద్రంగి మండలంలోని మానాల ప్రాంతాల్లోనూ రోడ్లు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి.

వేములవాడ పట్టణంలోని బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ మధ్య మూలవాగులో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి సందర్భంగా ఈ ఏడాది దాదాపు రూ.5 లక్షల వెచ్చించి నిర్మించిన మట్టి రోడ్డు వరదలో కలిసిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులపై పైవంతెనల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు చర్యలుఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. వర్షాలు తగ్గిన తరవాత అంచనాలు సిద్ధం చేసి పనులు చేపడతాం.

శాంతయ్య, డీఈ, ఆర్అండ్‌బీ

# హద్దులు తేలక.. హక్కులు తెలియక

సిరిసిల్ల : ప్రభుత్వ, ప్రైవేటు భూముల పహాణీలు, 1బి దస్త్రాలన్నీ వారి చేతుల్లోనే ఉన్నాయి. ఏం చేయాలనుకున్నా చేసే అధికారమూ ఉంటుంది. ఇదే అదనుగా ఓ రెవెన్యూ ఉద్యోగి హద్దుల్లేని ప్రభుత్వ భూమిలో పట్టా పొందాడు. రైతుబంధు జమవుతుండటంతో రెండేళ్ల క్రితం గ్రామస్థులు గుర్తించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుబంధును నిలిపివేయించారు. రెండ్రోజుల క్రితం అదే భూమికి హక్కుదారులమంటూ మరికొందరొచ్చారు. పశువుల మేత కోసం వదిలిన గుట్టప్రాంతాన్ని చదును చేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. హద్దుల్లేని రెవెన్యూ, అటవీ భూమిలో హక్కులు కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలోని కోనరావుపేట మండలంలో గతంలో పని చేసిన ఓ రెవెన్యూ ఉద్యోగి శివంగళపల్లి అడవి సరిహద్దులోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని దస్త్రాల్లో తన పేరున మార్చుకున్నాడు. గత ప్రభుత్వం 2018లో భూదస్త్రాల ప్రక్షాళన తర్వాత కొత్తగా ధరణిని తీసుకొచ్చింది. దీనిలోని రైతుల వివరాల ఆధారంగా రైతుబంధు అమలు చేసింది. ఇలానే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.40 వేలు చొప్పున జమయ్యాయి.

2021లో రైతుబంధు లబ్ధిదారుల జాబితాను గ్రామంలో ప్రదర్శించడ ంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో రైతుబంధును నిలిపివేశారు. భూమి పట్టా రద్దు కాలేదు.

ఇటీవల కొందరు గుట్టపై ఉన్న భారీ వృక్షాలను యంత్రాల సాయంతో నేలకూల్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అడ్డు చెప్పడంతో పాటు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పరిశీలించి అది అటవీశాఖ పరిధిలోనిది కాదని తేల్చారు. అయితే అనుమతి లేకుండా భారీ వృక్షాలను నరికినందుకు జరిమానా విధించారు.



చాలా ఏళ్ల క్రితం గ్రామంలోని నిరుపేదలకు అడవి సమీపంలోని ప్రభుత్వ భూమికి పట్టాలిచ్చారు. మిగిలిన భూమిని గ్రామంలో పశువుల మేతకు వదిలేశారు. ఇలా పట్టాలు చేయగా ఉన్న భూమిని దస్త్రాల్లోకి తన పేరున మార్చుకున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ధరణిలోనూ ఈ భూముల వివరాలేవీ చూపకపోవడంతో చేతులు మారినట్లు చెబుతున్నారు.

ఇలాంటివి ఎక్కడెక్కడ ఉన్నాయంటే...

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసాను ప్రకటించింది. గుట్ట ప్రాంతాన్ని సాగులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో రెవెన్యూ, అటవీ భూముల వివాదాలు కోనరావుపేట మండలం నిమ్మపల్లి, జైసేవాలాల్‌ఊరు తండా, వట్టిమల్లతోపాటు చందుర్తి, వీర్నపల్లి మండలాల్లోనూ ఉన్నాయి. కాగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, అటవీ భూములు ఉండటంతో గుర్తించడం కష్టంగా మారింది. అటవీశాఖ అధికారులు కంపార్టుమెంట్లు, కోఆర్డినేట్లు తీసుకుని కొలతలు వేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వే సమయంలో రెండు శాఖల మధ్య తేడాలు వస్తున్నాయి. దీనికి తోడు దస్త్రాల నిర్వహణలోనూ లోపాలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ప్రభుత్వ, అటవీ భూముల మధ్య హద్దులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శివంగళపల్లిలోని భూ వ్యవహారం జిల్లా అధికారుల దృష్టిలో ఉంది. దీనికి సంబంధించిన దస్త్రాలను అప్పగించాం. ఇప్పటికే రైతుబంధును నిలిపివేశారు. ఆ భూమిని గ్రామస్థులంతా గ్రామ అవసరాలకు ఉపయోగపడేలా ఉంచాలని కోరుతున్నారు.విజయప్రకాశ్, తహసీల్దార్

# వరదొస్తే మునక

కోరుట్ల: ఇది కోరుట్ల పట్టణంలోని ఫుల్‌వాగులోని వైకుంఠధామం. పట్టణంలో శ్మశానవాటిక లేకపోవడంతో ఫుల్‌వాగు స్థలంలో అప్పటిపాలకులు దీనిని నిర్మించారు. వాగు స్థలంలో చుట్టూ ప్రహరీ నిర్మించి నీటి సౌకర్యం కల్పించారు. రెండేళ్ల కిందట మున్సిపల్ నుంచి దాదాపు రూ. 1.30 కోట్లు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు. గతేడాది వాగులో వచ్చిన వరదలకు వైకుంఠధామం పూర్తిగా మునిగి ప్రహరీ, షెడ్లు దెబ్బతిన్నాయి.

కోరుట్ల పట్టణం ఆనుకొని సుమారు 2 కి.మీ పొడవునా ఫుల్‌వాగు (పెద్దవాగు) ఉంటుంది. పెద్దవాగుకు 100 అడుగుల దూరం వరకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలున్నాయి. ప్రభుత్వ భూములు, వాగులను పరిరక్షించాల్సిన పుర, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో వాగు స్థలాన్ని ఆక్రమించుకొని చదును చేసి ప్లాట్లుగా విక్రయాలు చేపట్టారు. నిరుపేద ప్రజలు తక్కువ ధరకు స్థలం లభిస్తుందని కొనుగోలు చేసి వాగులోనే నిర్మాణాలు చేపట్టారు. కొందరు ఏకంగా భవనాలు నిర్మించుకున్నారు. బల్దియా నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నేతల ఒత్తిళ్లతో మున్సిపల్ అధికారులు ఇంటినంబర్లు కేటాయించడంతో విద్యుత్తు సౌకర్యం సమకూర్చారు. తర్వాత కాలనీలలో మురుగు కాలువలు, సిమెంట్‌రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, మౌలిక వసతులు కల్పించారు. కొన్నేళ్లుగా వాగులో వరదలు వచ్చినప్పుడల్లా కాలనీలు పూర్తిగా జలమయమవుతున్నాయి. వర్షాకాలంలో ఇళ్ల నుంచి ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతేడాది వచ్చిన వరదలకు వాగు ఒడ్డు, మధ్యలో నిర్మించుకున్న పలు ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి.

**పరిరక్షించాల్సిన అధికారులే**

ప్రభుత్వ భూములు, వాగులను పరిరక్షించాల్సిన రెవెన్యూ, పురపాల



కశాఖ అధికారులు అందులోనే అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.కోట్లు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మించారు. గతేడాది వాగులో వచ్చిన వరదలకు వైకుంఠధామాలు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు రూ.లక్షల ప్రజాధనం వెచ్చించారు. ఎస్సీకాలనీ వద్దనున్న వాగులో ఎకరం స్థలంను పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉద్యానవనం కోసం రెవెన్యూ అధికారులు అయిదేళ్ల కిందట కేటాయించారు. అందులో రూ. 40 లక్షలు వెచ్చించి పార్క్ నిర్మాణ పనులు ప్రారంభించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. రెండేళ్ల కిందట వచ్చిన వరదలకు ప్రహరీ పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గుత్తేదారు పనులను మధ్యలోనే వదిలేశారు. వాగు ఒడ్డున ప్రభుత్వ ఉర్దూమీడియం పాఠశాలను నిర్మిచడంతో గతేడాది వరదలకు ప్రహరీ పూర్తిగా కూలిపోగా, వరదనీరు తరగతి గదుల్లో చేరి పాఠ్యపుస్తకాలు తడిచాయి.

ఇవి ఫుల్‌వాగులో అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లు. పట్టణంలోని ఎస్సీకాలనీని అనుకొని ఉన్న ఫుల్‌వాగులో అక్రమంగా కాలనీలు వెలిశాయి. గతేడాది వాగులో వచ్చిన భారీ వరదలతో కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. వాగులో వరద నీరు ప్రవహించినన్ని రోజులు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. పలు ఇళ్లు వరద తాకిడికి పూర్తిగా కొట్టుకుపోయి ధ్వంసమయ్యాయి.

# పేరు మాయం.. అన్నదాత ఆగం

సిరిసిల్ల : ప్రభుత్వం రెండు విడతలు చేసిన రుణమాఫీలో చిక్కుముళు వీడటం లేదు. మాఫీ అయినవారు ఆనందంతో ఉంటే.. కాని వారు ఎందుకు కాలేదోనని అయోమయానికి గురవుతున్నారు. తమ బ్యాంకు ఖాతా, పట్టాదారు పుస్తకాలు పట్టుకుని రైతు వేదికల్లోని ఏఈవోలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.జిల్లాలో రెండు విడతల్లో 35,700 మంది రైతులకు రూ. 251.35 కోట్లు మాఫీ అయింది. జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు ఇప్పటికీ 22 రకాల కారణాలతో 300 దరఖాస్తులు వచ్చాయి. వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ఎక్కువగా ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. వారి పేరున ఉన్న వ్యవసాయ భూమితో కుటుంబ సభ్యులు రుణం తీసుకున్నారు. భూమి ఒకరి పేరున, రుణం మరొకరి పేరున ఉన్న వారికి మాఫీ వర్తించలేదు.బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతు పేరు, ఆధార్ పేరు సరిపోకపోవడం, కొందరి ఆధార్ కార్డులలో ఇంటి పేరుకు బదులు కులం పేరు ఉన్నవి, వ్యవసాయ భూమి పాసుపుస్తకంపై ఉన్న పేరుకు ఆధార్‌లోని పేరుకు తేడా ఉండటం, రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని ప్రభుత్వం పేర్కొన్నా.. కుటుంబ నిర్ధారణ జరగని కారణంగా రేషన్ కార్డుల్లో పేర్లు లేనివారికి పంట రుణం మాఫీ కాలేదు. మరికొంత మంది కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వీరందరికీ చివరి విడతలో మాఫీ అవుతుందనే ఆశతో ఉన్నారు.వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్‌లో స్వీకరించిన ఫిర్యాదులను సవరించేందుకు ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు రాలేదు. దీంతో ఫిర్యాదు చేసిన రైతులు రుణ మాఫీకి తాము అర్హత పొందుతామా అని వ్యవసాయ అధికారులను కోరుతున్నారు. రుణమాఫీ నిధుల మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. గ్రీవెన్స్‌లోని ఫిర్యాదులు పరిష్కారం అయ్యాక తిరిగి నిధులు ఎప్పుడు విడుదల చేస్తారనేది స్పష్టత లేదు. వినతులను పరిష్కరించి మాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

చెల్లించిన రుణం చూపుతున్నారు

దుబాయి వెళ్లే ముందు 2016లో కొలనూరు కేడీసీసీ బ్యాంకులో రూ.70 వేలు పంట రుణం తీసుకున్నాను. తిరిగి వచ్చాక 2023 జులైలో తీసుకున్న రుణానికి వడ్డీతో సహా రూ.71,500 చెల్లించి ఖాతాను మూసివేశాను. 2023 ఆగస్టులో మళ్లీ సిరిసిల్ల కేడీసీసీ బ్యాంకులో లక్ష రూపాయల రుణం తీసుకున్నాను. వడ్డీతో కలిపి రెండో విడత మాఫీ జాబితాలో రాలేదు. దీనికి బ్యాంకు అధికారులను సంప్రదిస్తే నా పేరు మీద మొత్తం రూ. 1.78 లక్షలు ఉన్నట్లు చెబుతున్నారు. పాత రుణం వడ్డీతో సహా చెల్లించినా జాబితాలో చూపుతోంది.

– అన్నబోయిన శంకరయ్య, ధర్మారం

జాబితాలో పేరు లేదని...

నా భర్త వెంకటేశం 2020లో దుబాయి వెళ్లే ముందు స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.45 వేలు పంట రుణం తీసుకున్నారు. ఏడాది తర్వాత బ్యాంకు వారు రెన్యువల్ చేసుకుంటేనే రుణ మాఫీ వర్తిస్తుందన్నారు. మా ఆయన పేరున ఉన్న రుణ ఖాతాను నా పేరు మీదకు మార్చారు. వ్యవసాయ భూమి పాసుపుస్తకం మా ఆయన పేరున ఉండి రుణం నా పేరున ఉండటంతో మాఫీ జాబితాలో లేదని అధికారులు చెబుతున్నారు.

– దొంతరవేణి పద్మ, నిమ్మపల్లి

నివేదిక పంపుతాంరైతుల నుంచి వచ్చే వినతులను క్లస్టర్‌ల వారీగా ఏఈవోలు స్వీకరిస్తున్నారు. వాటిని జిల్లాలోని గ్రీవెన్స్ సెల్‌లో నమోదు చేస్తున్నాం. మూడో విడత పూర్తికాగానే వినతులను ఉన్నతాధికారులకు పంపుతాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే దానికి అనుగుణంగా పరిష్కారం చేస్తాం.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

రుణమాఫీ వివరాలు మొదటి విడత మాఫీ అయినవారు: 23,785

జమ చేసిన మొత్తం: రూ.135.35 కోట్లు రెండో విడత అర్హులు: 11,915 జమ చేసినది: రూ.116 కోట్లు బ్యాంకు శాఖలు: 18

గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులు: 300

# మరమ్మతులకే డబ్బుల్లేవు.. చెత్త తరలించేదెలా?

సారంగాపూర్: 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కాలంగా నిధులు రావడంలేదు. మొన్నటి వరకు సర్పంచులు ఉంటే వారే చూసుకునే వారు. ఇప్పటికే జేబుల నుంచి డబ్బులు పెట్టి పనులు చేయించాం. వచ్చే జీతం అరకొర ఉంటుంది. దీనికి తోడు గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న ట్రాక్టర్లు కిస్తీలు కట్టకపోవడంతో బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. చిన్న పంచాయతీలు కావడంతో ఎలాంటి ఆదాయ మార్గాలు లేక పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేకపోతున్నాం. అక్కడిక్కడ అప్పుచేసి అంతోఇంతో చెల్లిస్తూ నెట్టుకొస్తున్నాం. ఇలా ఎన్ని నెలలు భారం మోయమంటారంటూ జిల్లాలోని చిన్న పంచాయతీ కార్యదర్శుల ఆవేదన.'బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయిలో 102 జనాభా కలిగి ఉండగా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి నెల కేవలం రూ.12 వేలు వస్తుంది. ఇందులో ట్రాక్టర్ కిస్తీకే రూ.10 వేలు చెల్లిస్తుండగా, పంచాయతీ కార్మికుడికి రూ.9,500లు చెల్లించాల్సి ఉంటుంది. మిగతా ఖర్చులు, ట్రాక్టర్ మరమ్మతులు, క్లోరినేషన్, తదితర అవసరాలకు నిధులు ఎక్కడి నుంచి తీసుకురావాలి. సారంగాపూర్ మండలంలోని నాయకపుగూడెం పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు మూడు నెలలుగా డబ్బులు లేకపోవడంతో మూలన పడేశారు. పంచాయతీ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ చేయకపోవడం తో గ్రామస్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పక్కనే ఉన్న సారంగాపూర్ పంచాయతీ ట్రాక్టర్ తీసుకొచ్చి చెత్తను సేకరించాల్సి వస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణకు గత ప్రభుత్వం చెత్తను తరలించేందుకు ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌తోపాటు ట్యాంకర్, ఇతర పనిముట్లు కొనుగోలు చేసింది. ట్రాక్టర్ల కిస్తీల రుణ చెల్లింపు చిన్న పంచాయతీలకు మోయలేని భారంగా మారింది. ఆదాయ మార్గాలు లేక బ్యాంకు కిస్తీలు చెల్లించలేని దయనీయ పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుర్భర పరిస్థితి. జిల్లాలో 380 పంచాయతీలు ఉండగా గత ప్రభుత్వం దాదాపుగా 60 తండాలను పంచాయతీలుగా మార్చింది. ఆయా పంచాయతీలలో నెలసరి వచ్చే నిధులు కిస్తీలు, పారిశుద్ధ్య కార్మికుల చెల్లింపులకు సరిపోవడం లేదు. దీనికి తోడు నిధులు నిలిచిపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. కుంటుపడుతున్న అభివృద్ధి పంచాయతీలలో అభివృద్ధి పనులతోపాటు పారిశుద్ధ్యంపై అధికారులు చేతులెత్తేస్తున్నారు. చిన్న పంచాయతీలలో వసూలయ్యే ఏడాది ఇంటి పన్ను కేవలం రెండు, మూడు నెలల ట్రాక్టర్ కిస్తీలకు సరిపోవడంలేదు. విద్యుత్తు బకాయిలు, మరమ్మతులకు, క్లోరినేషన్ తదితర అవసరాలకు నిధులు సమకూరక అభివృద్ధి కుంటుపడుతుంది. ఏదైనా ప్రత్యేకంగా నిధులు పంచాయతీలకు జమ చేస్తే తప్పా గ్రామాల్లో పనులు చేసే పరిస్థితి లేదు.

# కమీషన్లే ప్రియం.. కొనుగోళ్ల పర్వం



హైదరాబాద్: విద్యుత్తు పంపిణీ సంస్థలో రూ.కోట్ల విలువైన పరికరాలు, సామగ్రి కొనుగోలులో గోల్‌మాల్ జరిగింది. కాంట్రాక్ట్ దక్కించుకున్న కొన్ని సంస్థలు నాసిరకం సామగ్రిని అంటగట్టాయి. టెండర్లవేళ ఒకటి చూపించి, తర్వాత మరోటి సరఫరాచేశాయి. ఆ సంస్థల ముడుపులకు ఆశపడి గత యాజమాన్యంలో కొందరు పెద్దలు నాణ్యత పరిశీలించకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. కొత్తపరికరాల వైఫల్యంపై ఇప్పటి యాజమాన్యం ఆరాతీయడంతో గతంలోని బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి.

సాకులతో తప్పించుకుంటూ.. దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ విద్యుత్తు లైన్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కరెంట్ తీగలు, ఇన్సులేటర్లు, పిన్‌లు.. ఇలా ప్రతిదీ టెండర్ ద్వారా కొనుగోలు చేస్తుంటుంది. టెండర్ దక్కించుకున్న కొన్ని సంస్థలు డిస్కంలో కావాల్సినవారి చేతులు తడిపి నాణ్యత లేని పరికరాలను ఇన్నాళ్లు సరఫరా చేస్తున్నాయి. ఇలాంటి అక్రమాల నివారణకు టెండర్లలో కొన్ని నిబంధనలు చేర్చారు. సరఫరా చేసినదానిలో 2.5శాతం సామగ్రిని ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం.. నివేదిక ఆధారంగానే సదరు సంస్థ, గుత్తేదారులకు బిల్లులు చెల్లించాలి. కొన్నేళ్లుగా డిస్కంలో ఈ విధానమే అమలు కావడంలేదు. గతంలో పై స్థాయిలో ఉన్నవారిలో కొందరి నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగానే సంబంధిత అధికారులు దీన్ని అటకెక్కించారని సమాచారం. ఆయా సంస్థలనుంచి కొందరు అధికారులు, యాజమాన్యంలో పెద్దలు భారీగా కమీషన్లు దండుకున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కంపెనీలనుంచి పరికరాలు కొనుగోలు చేశారు. గతంలో సీఈ స్థాయిలో అధికారి ఒకరు అభ్యంతరం చెబితే పైస్థాయి నుంచి ఒత్తిళ్లతో ఆయన్ను ఆ స్థానం నుంచి తప్పించడం గమనార్హం.

వైఫల్యాలతో వెలుగులోకి..

ఇటీవల విద్యుత్తు అంతరాయాలను కొత్త యాజమాన్యం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. కారణాలను ఫొటోలతో సహా సేకరిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఎక్కువ శాతం పరికరాల వైఫల్యమున్నట్లు గుర్తించింది. నాణ్యత లేకనే పరికరాలు తరచూ పాడవుతున్నట్లు నిర్ధారణకు వచ్చింది. యూజీ, ఏబీ కేబుల్స్ తొడుగులు పగిలిపోతున్నాయి. విద్యుత్తు స్తంభాలు ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున కుప్పకూలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ కేబుల్స్, ఆర్ఎంయూల వరకు నాణ్యతలో రాజీపడినట్లు కొత్త యాజమాన్యం ఒక అంచనాకు వచ్చింది. అధికారులను ఆరా తీస్తే నాణ్యత పరీక్షలే చేయడం లేదనే విషయం వెలుగులోకి వచ్చింది.

ప్రమాణాలకు తిలోదకాలు..

ప్రమాణాల మేరకు లేని పరికరాలు, సామగ్రితో విద్యుత్తువ్యవస్థ తీవ్రంగా నష్టపోతుంది. విద్యుత్తు అంతరాయాలతో పాటు కొన్నిసార్లు ప్రమాదాలకు ఆస్కారం ఉంటోంది. సంస్థపై మరింత ఆర్థిక భారం పడుతుంది. కొందరు స్వప్రయోజనాల కోసం ఇష్టారీతిగా కొనుగోళ్లకు అనుమతి ఇచ్చి నాణ్యతకు తిలోదాకాలు ఇచ్చారు. కమిషన్లకు కక్కుర్తిపడి అవసరం లేకున్నా కొనడంతో స్టోర్లలో ఏళ్లపాటు మూలన పడేసిన ఘటనలు డిస్కంలో గతంలో జరిగాయి. రింగ్ మెయిన్ యూనిట్లే ఇందుకు ఉదాహరణ.

పరీక్షించాకే ఇకపై బిల్లులు– ముషారఫ్ ఫరూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్

సామగ్రి కొనుగోలులో లోపాలను ఇప్పటికే గుర్తించాం. కొన్ని సంస్థలు టెండర్ సమయంలో ఒకటి చూపించి... మరోటి సరఫరా చేస్తున్నాయి. సరఫరా చేసిన సామగ్రి ర్యాండమ్‌గా ఎంపిక చేసి నాణ్యత పరీక్షలు నిర్వహించాక, సంతృప్తికరంగాఉంటే బిల్లులు చెల్లించబోతున్నాం. టెండర్‌లోనే ఈ నిబంధన ఉన్నా ఇన్నాళ్లు కాగితాలకే పరిమితమైంది. పక్కాగా అమలు చేయబోతున్నాం.

# మత్స్య సంపదకు ఊతం



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మత్స్య సంపదను పెంపొందించడంతో పాటు చేపలు పట్టి జీవించే మత్స్య కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా రాయితీ కల్పిస్తోంది. దానికి తోడు ప్రతి పారిశ్రామికుడికి ప్రభుత్వమే ప్రీమియం డబ్బులు చెల్లించి అయిదు నెలల వరకు బీమాతో దీమా ఇస్తుంది. బుధవారం జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మత్స్య సంపదకు చేస్తున్న కృషిపై కథనం.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాళేశ్వరం, ఎల్లంపల్లి, దిగువ, ఎగువ మానేరు, మధ్యమానేరు వంటి సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. వీటివల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా చెరువులు, కుంటల్లో నీరు నిలువ ఉండే అవకాశం కలుగుతుంది. దీంతో మత్స్య సంపదకు, చేపల ఉత్పత్తికి ప్రాధాన్యం పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు కోట్లకు పైగా పలు రకాల చేప పిల్లలు, 80 లక్షల వరకు రొయ్య పిల్లలను ఉచితంగా జలాశయాలు, చెరువులు, కుంటల్లో ప్రభుత్వం వదిలి చేయూతనిస్తుంది. దాదాపు 20 టన్నుల చేపల దిగుబడి వస్తుంది. ఇక్కడ పెరిగిన చేపలు రొయ్యలను కలకత్తా, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కేజీ కల్చర్ ద్వారా పెంచిన తిలాపియా చేపలను కూడా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

లైసెన్స్‌లు జారీ

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమం ద్వారా కూడా చేయూతనిస్తున్నారు. చేపల చెరువుల నిర్మాణానికి యూనిట్‌కు రూ.7 లక్షలు, చేప పిల్లల పెంపకానికి రూ.6 లక్షలు, హెచరీస్ నిధులు సమకూర్చుతున్నారు. వీటిని ఏర్పాటు చేసుకునే ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ఇస్తున్నారు. ఇవికాకుండా జలాశయంలో కేజీ కల్చర్ విధానంలో చేపలను పెంచే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుంది. చేపల చెరువుల నిర్మాణానికి, చేపపిల్లల పెంపకం కేంద్రాలకు దరఖాస్తులు కూడా తీసుకొని మంజూరుకు ప్రభుత్వానికి పంపించారు. దిగువమానేరు జలాశయంలో చేపలు పట్టుకునేందుకు 905 మందికి లైసెన్స్‌లు జారీ చేశారు. కరీంనగర్ జిల్లాలో 50 వేల మంది మత్స్య పారిశ్రామికులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తుండగా వీరందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.అయిదు లక్షలు చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు 20 కుటుంబాలకు అందజేశారు.

రాయితీపై వాహనాలు

మత్స్యకార్మికులకు వలలు, బుట్టలు, ఐస్‌బాక్స్‌లు వంటి వాటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాహనాల కొనుగోళ్లకు రాయితీ ఇస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు ఆటోలు, మొబైల్ వాహనాలకు 60 శాతం రాయితీ, కొందరికి 40 శాతం రాయితీ ఇచ్చి కొనుగోళ్లు చేయించారు. దీంతో పట్టుకున్న చేపలను వెంటనే గ్రామాలకు, మార్కెట్లకు వెళ్లి విక్రయించడానికి మార్గం సులభతరమవుతుంది. మరికొన్నింటికి కూడా రాయితీ ఇస్తున్నారు. మత్స్య కార్మికుల్లో మహిళకు 60 శాతం రాయితీ ఇచ్చారు. చేయూతకు ప్రభుత్వం కృషి

– విజయ, సహాయ సంచాలకురాలు, కరీంనగర్

చెరువులు, కుంటలు, జలాశయాల్లో చేపపిల్లలు పెంచేందుకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందించి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. మత్స్య శ్రామికులకు చేయూతనివ్వడానికి ప్రభుత్వం రాయితీపై పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆర్థికాభ్యున్నతి సాధించేలా సద్వినియోగం చేసుకోవాలి.

# రక్త కణాలు లెక్కించేదెలా?

వేములవాడ : గ్రామీణ ప్రాంతాల్లోనూ కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందించేందు కు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ అరకొర వసతులతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అన్ని రకాల టీకాలు, వివిధ పరీక్షలు నిర్వహించడమే కాకుండా రక్త కణాలు(సెల్ కౌంట్) లెక్కించే యంత్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)కు అందించారు. ప్రస్తుతం జిల్లాలో 90 మందికి పైగా డెంగీ పాజిటివ్ బాధితులు ఉన్నారు. ఇది కేవలం ప్రభుత్వ ఆస్పత్రులలో చేరిన వారు మాత్రమే. బాధితుల సంఖ్య పెరుగుతుండగా అందించిన పరికరాలు పనిచేయక పోవడంతో రోగ నిర్ధారణకు రక్త నమూనాలను జిల్లా ఆసుపత్రికి పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిత్యం దాదాపు వంద మందికి పైగా రోగులు వస్తున్నారు. వీరిలో ప్రస్తుతం విషజ్వరాలతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉంటున్నారు.

రెండు కేంద్రాల్లోనే.. జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా అన్ని కేంద్రాలకు రక్త కణాలు(సెల్ కౌంట్) యంత్రాలను అందించారు. దీని ద్వారా డబ్ల్యూసీ, ఆర్‌బీసీతోపాటు పలు రకాల పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో కేవలం మల్యాల, పెగడపల్లి పీహెచ్‌సీలలోనే రక్త కణాలు(సెల్ కౌంట్) యంత్రాలు ఉపయోగంలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరికరాలు పనిచేయడంలేదు. దీంతో ప్రస్తుతం ఉప కేంద్రాల పరిధిలో రాపిడ్(ఆర్‌డీటీ) కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించి పాజిటివ్ తేలితే మళ్లీ పరీక్షలకు జిల్లా స్థాయి ఆసుపత్రులకు పంపించాల్సి వస్తోంది. దీనివల్ల ఫలితాలు ఆలస్యమై రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. మండలాల్లో డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండడంతో నిరుపేదలు వైద్య సేవల కోసం ఆందోళన చెందుతున్నారు.

పీహెచ్‌సీలలో పనిచేయని సెల్ కౌంట్ యంత్రాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో అవసరమైనన వ్యాధి నిర్ధారణ పరీక్షలకు రక్త, మూత్ర నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని డయాగ్నోస్టిక్స్ కేంద్రానికి పంపించి ఫలితాలు అందిస్తున్నారు. సేకరించిన నమూనాలు జిల్లాలోని టీహబ్‌కు చేరాక సిబ్బంది పరీక్షించి ఫలితాల నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. వచ్చిన ఫలితాన్ని బాధితుడి చరవాణికి పీడీఎఫ్ రూపంలో పంపించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో చరవాణికి పంపిన నివేదికను బాధితులు చూసుకోవడం ఇబ్బందిగా మారింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి నేరుగా ఫలితాన్ని పంపించి బాధితులకు ప్రింట్ రూపంలో ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ప్రింటర్లు అందించినప్పటికీ దానికి సంబంధించిన సామగ్రి అందించకపోవడంతో నిరుపయోగంగానే ఉంటున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేయని రక్త కణాలు(సెల్ కౌంట్) యంత్రాల మరమ్మతు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. ఆరోగ్య కేంద్రాల వారీగా సమస్యను గుర్తించేందుకు టెక్నీషియన్ ద్వారా మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం జ్వరాలతో బాధపడుతున్న వారికి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. డెంగీ బాధితుల సంఖ్య పెరిగితే జగిత్యాలలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందించేలా ప్రణాళిక తయారు చేస్తున్నాం.– షమీయొద్దీన్, జిల్లా వైద్యాధికారి

# ఆలయ పరిసరాల్లో రహదారుల కబ్జా

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో చాలా వరకు రహదారులు ఇరుకుగా ఉన్నాయి. ఇలాంటి పట్టణంలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా రోడ్లను ఆక్రమించి డబ్బా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా రాజన్న ఆలయ పరిసరాలే కాకుండా ముఖ్యమైన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేయడమే కాకుండా మరింత ముందుకు రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మరింత ఇరుకుగా మారుతున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయ పరిసరాల్లో కొందరు డబ్బాలు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తూ దందా సాగిస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని జగిత్యాల బస్టాప్ వైపు రోడ్డు, లక్ష్మీగణపతి కాంప్లెక్స్ చుట్టూ, కట్ట కింద రోడ్డు ప్రాంతాల్లో చాలా వరకు రాజన్న ఆలయ వసతి గృహాలున్నాయి. మరోవైపు ఆలయ గుడి చెరువు కట్టను ఆనుకొని రహదారి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో కొంత మంది పలుకుబడి ఉపయోగించి రహదారులపై పెద్ద ఎత్తున డబ్బాలు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా రాత్రికి రాత్రే ఏర్పాటు చేసి ఇతరులకు అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటూ మున్సిపల్, ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరోవైపు భక్తులు, స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఇరుకు రోడ్లతో...

ప్రధానంగా రాజన్న ఆలయానికి ప్రతి రోజు వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. వీరితో పాటు స్థానికులు, ఇతర గ్రామాల ప్రజలు పనుల కోసం వస్తుంటారు. దీంతో ఆలయ పరిసరాల రహదారులు జన సందోహంగా మారుతాయి. దీంతో పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి బద్దిపోచమ్మ ఆలయం, అంబేడ్కర్ కూడలి, ఆలయ ప్రధాన రహదారి, తిప్పాపూర్ కూడలి, కట్టకింద జగిత్యాల రోడ్డు, జాత్రగ్రౌండ్‌లు జనంతో కిక్కిరిసిపోతుంటాయి. ఇలాంటి సందర్భంలో వ్యాపారులు రోడ్ల ఆక్రమణలతో భక్తులు, స్థానికులు పడే అవస్థలు వర్ణణాతీతం. ఈ ఇబ్బందులు అధికారులకు తెలిసినప్పటికీ ఎందుకు తొలగించడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది. ముఖ్యంగా రాజన్న ఆలయ పరిసరాలు, బద్ది పోచమ్మ ఆలయ పరిసరాల్లో రోడ్లన్నీ ఇరుకుగా ఉంటాయి. ఇలాంటి రహదారిలో దుకాణాలు వదిలి రోడ్లపైనే వస్తు సామగ్రి పెట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. రహదారికి ఇరువైపులా దుకాణాల నిర్వాహకులు సగానికి పైగా రోడ్లను ఆక్రమిస్తున్నారు. ఆగస్టు 5 నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. దీంతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇప్పటికైనా మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.పరిశీలించి చర్యలు తీసుకుంటాం పట్టణంలో రహదారుల ఆక్రమణల ను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. భక్తులు, స్థానికులకు ఇబ్బందులు కలిగే విధంగా రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పోలీసు అధికారుల సమన్వయం తో ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపడతాం.– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ








## బారాముల్లాలో పారిపోతున్న ఉగ్రవాది.. గర్జించిన సైన్యం తుపాకులు: వీడియో వైరల్

ప్రధాని మోదీ పర్యటనకు ముందు బారాముల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ డ్రోన్ ఫుటేజీ తాజాగా వైరల్‌గా మారింది. ఇందులో ఓ ఉగ్రవాది నక్కిన ఆ ఇంటిని సైన్యం తూటాలతో జల్లెడ చేసేసింది. దీంతో అందులో దాక్కొన్న టెర్రరిస్టు రైఫిల్‌తో కాల్పులు జరుపుతూ బయటకు పరిగెత్తుకొచ్చాడు. ఈ క్రమంలో ఒకచోట పడిపోయాడు. కొద్దిసేపు కాల్పులు జరిపాడు. తర్వాత లేచి పక్కనే పొదల్లో గోడచాటుకు వెళ్లి నక్కాడు. సైన్యం ఆ దిశగా తూటాల వర్షం కురిపించడం స్పష్టంగా కనిపించింది.

అతడు దాక్కొన్న పొదలపై తెల్ల పొగ కనిపిస్తోంది. బారాముల్లా చాక్ తాప్పర్ క్రేరీలో జరిగిన శనివారం రాత్రి మొత్తం జరిగిన ఎన్‌కౌంటర్లో భద్రతా దళాలు ముగ్గురు కరుడుగట్టిన ఉగ్రవాదులను మట్టుబెట్టిన విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాకిస్థాన్ వైపు నుంచి ఉగ్ర ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. గత వారం రోజుల్లో మూడుసార్లు ఉగ్ర చొరబాట్లకు యత్నాలు జరిగా యి. 70 నుంచి 80 మంది ఉగ్రవాదులు నియంత్రణ రేఖకు ఆవలివైపు సిద్ధంగా ఉన్నట్లు సైన్యం గుర్తించింది. వీరి చొరబాట్లకు వీలుగా పాక్ సైన్యం, రేంజర్లు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది.

గత ఏడు రోజుల్లో నౌషేరా సెక్టార్, పూంఛ్-దిగ్వార్, ఉదంపూర్, జమ్మూలోని కనాచక్ చొరబాట్లకు యత్నాలు జరిగాయి. సెప్టెంబర్ 18న జమ్మూ-కశ్మీర్‌లో 24 స్థానాల్లో తొలివిడత ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్‌కౌంటర్లు వేగవంతం కావడం గమనార్హం.

# అమరావతి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధుల జమ..!!

అమరావతి : ఏపీ ప్రభుత్వం అమరావతి రైతులకు బకాయిలు విడుదల చేసింది. అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలును సీఆర్డీఏ నేరుగా వారి ఖాతాల్లోజమ చేయనుంది. ఇందు కోసం ప్రభుత్వం రూ 400 కోట్లను విడుదలకు ఆమోద ముద్ర వేసింది. అదే సమయంలో హైకోర్టు భవనం ప్రాంగణంలో అదనపు నిర్మాణాలకు సంబంధించి రూ. 13.33 కోట్లను సీఆర్డీఏ విడుదల చేసింది. అమరావతిలో కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిలో పెండింగ్ అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది. భూసమీకరణ పెండింగ్ లో ఉన్న గ్రామాల్లో రైతులతో నేరుగా మంత్రి నారాయణ సంప్రదింపులు చేస్తున్నారు. వారిని భూములు ఇచ్చేందుకు ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. భూములు ఇస్తే కోరిన చోట ప్లాట్లు కేటాయిస్తామని హామీ ఇస్తున్నారు. ఇక, అమరావతిలో నిర్మాణాల పైన అధ్యయనం చేసిన చెన్నై ఐఐటీ నిపుణుల బృందాలు ప్రాథమిక నివేదికను అందజేసినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో తుది నివేదికను అందజేయనున్నట్లు తెలుస్తోంది.

ఈ నివేదికలో మరోవైపు అమరావతిలో హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల పునాదులకు ఎలాంటి ఇబ్బంది లేదని తేలింది. ఐదేళ్లుగా నీళ్లలో ఉంటూ, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్న నివాస భవనాల టవర్ల పటిష్ఠతపై చెన్నై, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణులు క్లారిటీ ఇచ్చారు. మరోవైపు శాసనసభ, హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాలకు ఆర్కిటెక్చరల్ డిజైన్లు, సేవలు అందజేసేందుకు సీఆర్డీఏ టెండర్లను ఆహ్వానించింది. వచ్చే నెల 4 మధ్యాహ్నం 2 గంటలలోపు బిడ్‌లు దాఖలు చేయాలని సూచించింది ప్రభుత్వం. వచ్చే నెల 4న సాయంత్రం టెక్నికల్ బిడ్‌లు ఓపెన్ చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది.



# పవన్ కళ్యాణ్ అరుదైన ఫీట్- ప్రపంచ రికార్డు సర్టిఫికెట్ ..!

అమరావతి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అరుదైన ఘనత సాధించారు. కూటమి ప్రభుత్వంలో కీలకంగా మారిన పవన్ కళ్యాణ్.. సర్కార్ ఏర్పాటు తర్వాత డిప్యూటీ సీఎంగా తనదైన ముద్ర ఉండేలా చూసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఏరికోరి తీసుకున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సంస్కరణలకు ప్రయత్నిస్తున్న పవన్.. అప్పుడే ఓ వరల్డ్ రికార్డు కూడా సాధించారు. ఈ మేరకు ఆయన సర్టిఫికెట్ కూడా అందుకున్నారు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లోనే తనకు అప్పగించిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ తరఫున ప్రపంచ రికార్డ్ సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించినందుకు గానూ ఈ ప్రపంచ రికార్డ్ దక్కింది. వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ఆంధ్ర ప్రదేశ్ లో ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామ సభలకు రికార్డుగా గుర్తింపు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన రికార్డ్ పత్రాన్ని, మెడల్ ను ఇవాళ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు వరల్డ్ రికార్డ్స్ యూనియన్ అఫిషియల్ రికార్డ్స్ మేనేజర్ శ్రీ క్రిస్టఫర్ టేలర్ క్రాఫ్ట్ అందచేశారు. హైదరాబాద్ లోని పవన్ కళ్యాణ్ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఒకే రోజు ఈ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సభలు నిర్వహించడం అతి పెద్ద గ్రామ పాలనగా గుర్తిస్తున్నట్లు వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రతినిధి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ సభలు నిర్వహించకపోవడం, పంచాయతీలను నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన పవన్ కళ్యాణ్ తాము అధికారంలోకి రాగానే దీనిపై రివ్యూ చేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 13326 సభలు నిర్వహించి అందులో స్థానికంగా చేపట్టాల్సిన పనులపై తీర్మానాలు చేయించారు. దీంతో పంచాయతీలకు కొత్త కళ వచ్చినట్లయింది. అలాగే పంచాయితీలకు ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయించారు.

# ఆ టీడీపీ ఎమ్మెల్యేలను పిలిపించనున్న చంద్రబాబు ! అవసరమైతే చర్యలు..!



అమరావతి : ఏపీలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకుంటోంది. ఈ వంద రోజుల్లో ప్రభుత్వ పాలన ఎలా ఉంది, సంక్షేమ పథకాల్లో వెనుకబాటు, అభివృద్ధి చర్యల్లో వేగం, మంత్రుల పనితీరు, మొత్తంగా ప్రభుత్వ పనితీరు ఎలా ఉందన్న అంశాలపై జనం ఏమనుకుంటున్నది తెలుసుకునేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం గుజరాత్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు అక్కడి నుంచి రాగానే కొందరు ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అవుతారని తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీతో కూటమి సర్కార్ 100 రోజుల పాలన పూర్తి చేసుకోబోతోంది. దీంతో మంత్రుల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమవుతున్నారు. అదే సమయంలో కొందరు ఎమ్మెల్యేల పనితీరుపైనా ఆగ్రహంగా ఉన్నారు. కొందరి వ్యవహారశైలితో మొత్తం ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని కేబినెట్ భేటీలోనే చెప్పేశారు. దీంతో వారిని గాడిన పెట్టే బాధ్యత కూడా మంత్రులకే అప్పజెప్పారు. ఇప్పుడు ప్రభుత్వంపై ఓవరాల్ గా ఫీడ్ బ్యాక్ ఎలా ఉందో కూడా తెలుసుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం గుజరాత్ పర్యటనలో ఉన్న చంద్రబాబు..రేపు లేదా ఎల్లుండి టీడీపీ ఎమ్మెల్యేలతో భేటీ కాబోతున్నారు. గుజరాత్ నుంచి రాగానే ఎమ్మెల్యేలను విడతల వారీగా లేదా ఒకేసారి పిలిపించి మాట్లాడబోతున్నారు. కూటమి సర్కార్ 100 రోజుల పాలనపై వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోబోతున్నారు. ఈ 100 రోజుల్లో ప్రభుత్వం పాలన ఎలా ఉంది. ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందో వారి నుంచే అభిప్రాయ సేకరణ చేయబోతున్నారు. ఇప్పటికే మహిళా ఎమ్మెల్యే భర్త తీరుపై చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదులు అందాయి. పార్టీ కార్యకర్తలను పట్టించుకోకుండా వైసీపీ నాయకులను, కార్యకర్తలను వెంటపెట్టుకొని తిరగడం పై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం గా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు మరికొందరు ఎమ్మెల్యేలపైనా చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారు. వీరిని స్వయంగా పిలిపించి మాట్లాడనున్నారు. అలాగే రేపు లేదా ఎల్లుండి నామినేటెడ్ పదవులు భర్తీ చేసే అవకాశం ఉంది. తొలి విడతగా 18 కార్పొరేషన్ ఛైర్మన్ల జాబితా విడుదల చేసే అవకాశముంది.

# బోట్ల వెలికితీతకు మరో ప్లాన్.. అమలు చేస్తున్న ఇంజినీర్లు



విజయవాడ: ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు ప్రక్రియ ఏడో రోజు కొనసాగుతోంది. బ్యారేజీ గేట్లకు అడ్డంగా చిక్కుకున్న భారీ ఇనుప బోట్లను తొలగించడానికి ఆరు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలితమివ్వడం లేదు. దీంతో మరో ప్రణాళికను బెకెమ్ ఇన్‌ఫ్రా సంస్థ ఇంజినీర్లు అమలు చేస్తున్నారు. రెండు భారీ పడవలను ఇనుప గడ్డర్లతో అనుసంధానించి తీయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. మూడు రోజుల కిందట కాకినాడ నుంచి నిపుణుల బృందాన్ని పిలిచి, రంగంలోకి దింపారు. వీరు గేట్ల వద్ద చిక్కుకున్న మూడు బోట్లను నీటిలో నుంచే ఎగువకు తీసుకెళ్లాలనుకున్నా వీలుకాలేదు.

ఆదివారం దుర్గాఘాట్ వైపు పొక్లెయిన్లు పెట్టి భారీ ఇనుప రోప్‌లతో లాగే ప్రయత్నం చేసినా, ఫలితం లేదు. దీంతో అధికారులు, నిపుణులు మరో ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఒక్కోటి 50 టన్నుల సామర్థ్యం గల రెండు బోట్లను తెప్పించారు. వాటిని ఇనుప గడ్డర్లతో అనుసంధానించారు. క్రేన్ల సహాయం కూడా తీసుకొని బోట్లను బయటకు తీసేందుకు యత్నిస్తున్నారు.

# వివేకా కేసులో అవినాష్‌ను కాపాడుతున్న జగన్.. అసలు కారణం అదేనా..




వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును సీబీఐ విచారిస్తోంది. దాదాపు హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఈ దారుణానికి ఒడిగట్టింది ఎవరనే దానిపై అధికారికంగా స్పష్టత రాలేదు. ఈ హత్య చేసిందెవరో కోర్టు తుది తీర్పు తర్వాతనే తేలనుంది. సీబీఐ సుదీర్ఘకాలంగా కేసును విచారిస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి అరెస్ట్ తర్వాత ఈ కేసు విచారణలో స్పీడ్ తగ్గింది. వాస్తవానికి వైఎస్ అవినాష్ రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేయడానికి ప్రయత్నించినా.. కుదరలేదు. చివరికి తెలంగాణ హైకోర్టులో ఆయన ముందస్తు బెయిల్ పొందడంతో అవినాష్ అరెస్ట్ విషయం వెనక్కి వెళ్లిపోయింది. ఇంత జరుగుతున్నా.. వివేకానంద రెడ్డి హత్య ఎందుకు జరిగింది.. ఈ హత్యలో ఎవరు పాత్రదారులు.. ఎవరు సూత్రదారులు అనేది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. చట్టప్రకారం దర్యాప్తు సంస్థలు విచారణ పూర్తి చేసి సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన తర్వాత.. న్యాయస్థానం తీర్పు తర్వాత ఈ హత్యలో దోషులు ఎవరో అధికారికంగా తేలుతుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు సీబీఐ విచారణ మందగించింది. ఓవైపు ఎన్నికల సమయం కావడంతో కొంత గ్యాప్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లుగా సీబీఐ ఈ కేసులో అసలు నిందితులను అరెస్ట్ చేసే ప్రయత్నం చేసినా.. గత వైసీపీ ప్రభుత్వం ఏదో విధంగా వారి విధులకు ఆటంకం కలిగిస్తూనే ఉందనే ఆరోపణలు ఉన్నాయి. నిందితులను కాపాడేందుకు జగన్ తీవ్రంగా ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తు సక్రమంగా జరగకుండా మాజీ సీఎం జగన్ కుట్రలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఏకంగా సీబీఐ అధికారులపై కేసులు నమోదు చేసిన సందర్భాలు చూశాము. దర్యాప్తు సంస్థల అధికారుల నైతికతను, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం గత వైసీపీ ప్రభుత్వం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైసీపీ అధికారంలో లేదు. జగన్ ప్రజల మద్దతును కోల్పోయారు. ఈ నేపథ్యంలో సీబీఐ వివేకా కేసు దర్యాప్తును వేగవంతం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**నిందితులకు అండగా..** 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రప్రభుత్వ దర్యాప్తు సంస్థలపై విశ్వాసం లేదని.. నిందితులను ప్రభుత్వం కాపాడే అవకాశం ఉందన్న అనుమానాంతో వివేకా కుమార్తె సునీత కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ కేసు దర్యాప్తును న్యాయస్థానం సీబీఐకి అప్పగించింది. సీబీఐ దర్యాప్తుతో అసలు విషయాలు బయటకు వస్తాయని అంతా భావించారు. అనుకున్నట్లుగానే కడప ఎంపీ అవినాష్ రెడ్డి పాత్ర ఈ హత్యలో ఉన్నట్లు సీబీఐ ప్రాథమికంగా ఆధారాలు సేకరించిందనే ప్రచారం జరిగింది. గూగుల్ టేకవుట్, టైమ్ లైన్ ఆధారంగా అవినాష్ రెడ్డికి ఈ హత్యతో ప్రమేయం ఉన్నట్లు సీబీఐ నిర్ధారణకు వచ్చిందన్న ప్రచారం జరిగింది. కానీ అవినాష్ రెడ్డిని ఇప్పటిరవకు ఈ కేసులో అరెస్ట్ కాలేదు. సీఎం జగన్మోహన్ రెడ్డి అవినాష్ రెడ్డిని కాపాడుతూ వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అవినాష్ రెడ్డిని కస్టడీలోకి తీసుకుని సీబీఐ అధికారులు విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని.. అదే జరిగితే మాజీ సీఎం జగన్‌తో పాటు ఆమె భార్య భారతి ఇరుక్కునే అవకాశం ఉండటంతోనే అవినాష్ రెడ్డిని జగన్ కాపాడుతున్నారనే చర్చ జరుగుతోంది. ఎంపీ టికెట్ కోసమే ఈ హత్యను చేసినట్లు కేసులోని కొందరు సాక్ష్యులు, నిందితులు ఇప్పటికే చెప్పారు. దీంతో ఈ విషయం బయటకు వస్తే వైసీపీతో పాటు జగన్ రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉండటంతోనే జగన్ నిందితులకు అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది.

**భారతి ప్రమేయం ఉందా..** సీబీఐ ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పెంచే అవకాశం ఉందన్న చర్చ జరుగుతున్న క్రమంలో జగన్ భార్య భారతి పేరు తెరపైకి వస్తుంది. ఆమెను దర్యాప్తు సంస్థ అధికారులు విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎంపీ టికెట్ విషయంలో వివేకానందరెడ్డికి, అవినాష్ రెడ్డికి మధ్య విభేధాలు రాగా.. భారతి ఎంపీ టికెట్‌ను అవినాష్ రెడ్డికి ఇవ్వాలని ఒత్తిడి చేయగా.. వివేకానందరెడ్డి ఉండగా ఎంపీ టికెట్ ఇవ్వడం కుదరదని జగన్ చెప్పడంతోనే.. హత్యకు ప్లాన్ చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఈ క్రమంలో వివేకానందరెడ్డి హత్య కేసు విషయంలో భారతిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వివేకా బతికి ఉంటే జగన్ ఏకపక్ష నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోరని, కడప ఎంపీ టికెట్‌ను అవినాష్ రెడ్డికి దక్కనీయరనే అనుమానంతోనే హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయి.


ఈ అనుమానాలు, ఆరోపణలను నివృత్తి చేసే బాధ్యత ప్రస్తుతం దర్యాప్తు సంస్థలపైనే ఉంది. సీబీఐ విచారణ ఎలా ఉండబోతుంది. ఈకేసులో మరెవరినైనా అరెస్ట్ చేస్తారా లేదా అనేది భవిష్యత్తులో తేలనుంది.

# సీఎం చంద్రబాబు పట్టుదలతో విజయవాడలో సాధారణ పరిస్థితులు: మంత్రి ఆనం



తిరుమల: సీఎం చంద్రబాబు పట్టుదలతో విజయవాడ ప్రాంతంలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన దర్శించుకున్నారు. తొలుత తితిదే అధికారులు ఆయన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి సంపూర్ణ సహకారాలు అందించేలా స్వామివారు దీవెనలు ఇవ్వాలని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ఐదేళ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థను వైకాపా నాశనం చేసిందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దాన్ని 100 రోజుల్లో సరి చేశారన్నారు. రాష్ట్రంలో సంతృప్తికర పాలన చేస్తున్న చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామిని వేడుకున్నట్లు చెప్పారు. విజయవాడ వరదల్లో కుట్రకు పాల్పడిన వారికి స్వామి తగిన బుద్ధి చెప్తారన్నారు. మరోవైపు ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

# వాటిపై చంద్రబాబు, పవన్ సమాధానం చెప్పాలి..



విజయవాడ, సెప్టెంబర్ 16: ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు జపం చేస్తున్నారని విమర్శించారు. చెప్పినవి ఏం చేశారని... మసిపూసి మారేడు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కూడా ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. విశాఖ స్టీల్‌కు ప్రత్యేకంగా బొగ్గు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. "మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే విశాఖ స్టీల్‌ను ప్రైవేటుపరం కాకుండా చూడండి" అంటూ డిమాండ్ చేశారు. ఇండియాలో పెద్ద ఇమేజ్ ఉన్న స్టీల్ పరిశ్రమ విశాఖది అని చెప్పుకొచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయం, మెడికల్ సిట్ల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా ఉద్యోగుల తీరు మారటం లేదన్నారు. ఉద్యోగులు అయ్యుండి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేయటం హర్షించదగ్గ విషయం కాదన్నారు. ఇప్పటికే జగన్‌కు భజన చేసిన ముగ్గురు అధికారులు సస్పెండ్ అయ్యారని తెలిపారు. రేపు సీపీఐ ఆధ్వర్యంలో కొల్లేరు నుంచి బుడమేరు వరకు పరిశీలించి ఎల్లుండు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలుస్తామని సీపీఐ నేత రామకృష్ణ పేర్కొన్నారు.

# ఆ ఐపీఎస్‌లను సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నా



గుంటూరు, సెప్టెంబర్ 16: చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దుర్మార్గంగా వ్యవహరించిన ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నానని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ముగ్గురిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని.. వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఐపీఎస్ వ్యవస్థే తలదించుకునే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. స్వచ్చంధంగా ఐపీఎస్‌లు రాజీనామా చేసి వాళ్ళు చేసిన తప్పు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. సజ్జల వలనే తాము ఈ విధంగా చేశామని చెబితే వారి గౌరవం పెరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమ పార్టీకే చెందిన ఎమ్మెల్యేను సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. అధికారుల చేత నటి జెత్వానీని అరెస్టు చేయించిన సజ్జలను అరెస్ట్ చేయాలన్నారు. ట్రిబ్యునల్‌కు వెళ్తామనటం సమర్థనీయం కాదన్నారు. ముగ్గురిని వైసీపీలో చేర్చుకొని జిల్లా అధ్యక్షులుగా చేయాలని.. లేదంటే జగన్ సెక్యూరిటీ అధికారులుగా నియమించుకోవాలంటూ వ్యాఖ్యలు చేశారు. కేంద్రానికి లేఖ రాసి ముగ్గురుని ఐపీఎస్ నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు.

# చీరలో సింప్లీ సూపర్ చారు మేడం

2019లో 'నాని గ్యాంగ్ లీడర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ ప్రియాంక అరుళ్ మోహన్. కర్ణాటకలోని బెంగళూరులో జన్మించిన ఈ అమ్మడు 'ఒంధ్ కతే హెల్లా' సినిమా తో కన్నడ సినిమా పరిశ్రమలో అడుగు పెట్టింది. మొదటి సినిమాలో గెస్ట్ గా నటించిన ప్రియాంక మోహన్ ఆ తర్వాత తెలుగులో నాని తో కలిసి నటించింది. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోకున్నా ప్రియాంక మోహన్ కి మంచి గుర్తింపు లభించింది. ఆ వెంటనే శర్వానంద్ హీరోగా రూపొందిన శ్రీకారం సినిమాలో నటించింది. ఆ సినిమా తర్వాత తమిళ సినిమాల వైపు వెళ్ళింది. వైద్యుడు, ఏతార్కుం తూనింధవన్, డాన్, టిక్ టాక్, కెప్టెన్ మిల్లర్ సినిమాలతో తమిళ ప్రేక్షకులను అలరించింది. తాజాగా తెలుగు లో ఈమె సరిపోదా శనివారం సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల నడుమ రూపొందిన ఆ సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చింది. నానితో కలిసి ప్రియాంక అరుళ్ మోహన్ వరుసగా రెండో సినిమాను చేసింది. రెండు సినిమాలూ డీసెంట్ హిట్ ను



సొంతం చేసుకున్న నేపథ్యంలో ముందు ముందు వారి కాంబోలో మరిన్ని సినిమాలు వచ్చే అవకాశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం పవన్ తో కలిసి ఈ అమ్మడు ఓజీ సినిమాలో నటిస్తోంది. కెరీర్ ఆరంభం నుంచి సింప్లీ సూపర్ అనిపించుకుంటూ ఉన్న ప్రియాంక అరుళ్ మోహన్ మరోసారి తన చీర కట్టు ఫోటోలతో సంప్లీ సూపర్ అనిపించుకుంది. చీర కట్టి, లూజ్ హెయిర్ తో కెమెరా ముందు హొయలు పోకుండా సింపుల్ గా ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన ప్రియాంక మోహన్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నాని సినిమాల్లో ఉన్నట్లుగానే చాలా సింపుల్ గా, చాలా డీసెంట్ గా ఉన్నావు అంటూ ప్రియాంక పై ప్రశంసలు కురిపిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. సరిపోదా శనివారం సినిమాలో కానిస్టేబుల్ చారులతగా ఎలా అయితే కనిపించి మెప్పించిందో అలాగే ఈ ఫోటోల్లో సింప్లీ సూపర్ అన్నట్లుగా ఉంది. పవన్ కళ్యాణ్ తో చేస్తున్న 'ఓజీ' సినిమా కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సాహెూ సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓజీ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తి అయి విడుదల అవ్వాల్సి ఉన్నా పవన్ కళ్యాణ్ రాజకీయాలతో బిజీగా ఉండటం వల్ల ఆలస్యం అవుతూ వస్తోంది. ఈ నెలలో షూటింగ్ పునః ప్రారంభించాలి అనుకున్నారు. ప్రియాంక డేట్స్ కూడా తీసుకున్నారట. కానీ ఏపీ లో పెద్ద ఎత్తున వర్షాలు, వరదలు రావడంతో ఓజీ సినిమా షూటింగ్ మళ్లీ ఆలస్యం అవుతోంది. పవన్ తో ప్రియాంక మోహన్ ను చూడాలని ఆమె ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఫస్ట్ లుక్: అందాల వేదిక భయంభయంగా..

విభిన్న పాత్రలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన వేదిక మొదట బాణం సినిమాతో మంచి నటిగా కెరీర్ స్టార్ట్ చేసింది. సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా ఆమె సినిమాలు చేసుకుంటూ వెళుతోంది. "కాంచన 3" మరియు "రూలర్" వంటి చిత్రాలతో కూడా మంచి గుర్తింపు పొందిన వేదిక ఒక భాషకు మాత్రమే పరిమితం కాలేదు. తెలుగు తమిళ్ మలయాళం భాషల్లో వరుసగా సినిమాలు చేస్తోంది. అలాగే కన్నడలో కూడా ఛాన్సులు గట్టిగానే అందుకుంటోంది. కమర్షియల్ సినిమాలు మాత్రమే కాకుండా మంచి కంటెంట్ ఉన్న చిన్న బడ్జెట్ సినిమాల్లో కూడా కీలక పాత్రల్లో నటిస్తోంది. రీసెంట్ గా ఓటీటీ ప్రపంచంలో కూడా బిజీగా మారిపోయింది. పలు వెబ్



సీరీస్ లు చేసిన అమ్మడు యక్షిని అనే ప్రాజెక్ట్ చేసింది. ఇక ఇప్పుడు "ఫియర్" అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఈ సినిమాను డాక్టర్ హరిత గోగినేని దర్శకత్వంలో, దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సహనిర్మాతలుగా సుజాతా రెడ్డి, సమా సురేందర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో పలు పురస్కారాలను సొంతం చేసుకున్న ఈ చిత్రం, ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా దర్శకుడు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా చేతుల మీదుగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ పోస్టర్ లో వేదిక ఒక చీకటి గదిలో భయపడుతున్నట్లు కనిపిస్తూ, సినిమా పై ఆసక్తిని పెంచుతోంది. ఫస్ట్ లుక్ తోనే సినిమా పట్ల ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. "ఫియర్" చిత్రం ద్వారా ప్రేక్షకులకు కొత్త తరహా థ్రిల్లర్ అనుభవం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. వేదిక ఈ సినిమాలో చేయబోయే పాత్ర ఆమె కెరీర్‌లో ప్రత్యేకతగా నిలుస్తుందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ చిత్రంలో అర్విండ్ కృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం అనేక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్ లో 60కి పైగా అవార్డులను గెలుచుకోవడం విశేషం. సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు. "ఫియర్" సినిమాలో వేదిక పాత్ర ప్రేక్షకులకు కొత్తగా అనిపించే విధంగా రూపొందించారని మేకర్స్ తెలియజేస్తున్నారు.




# 2025 పవర్ స్టార్ అభిమానులకు ట్రిపుల్ బోనంజా



ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పూర్తిగా ప్రభుత్వ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్న సంగతి అందరికి తెలిసిందే. ఇదిలా ఉంటే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి ఓ వర్గం ఫ్యాన్స్ సినిమాలు కోరుకుంటున్నారు. ఆయన కమిట్ అయిన 3 సినిమాలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయి. వీటిలో రెండు పాన్ ఇండియా ప్రాజెక్ట్ లు కావడం విశేషం. అయితే ఇప్పుడు ఈ మూడు సినిమాలు కూడా 2025 లో ప్రేక్షకుల ముందుకి వచ్చే ఛాన్స్ ఉంది. పవన్ కళ్యాణ్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో ఈ చిత్రాలు తెరకెక్కుతున్నాయి. ఈ సినిమాలు వరుసుగా ఫినిష్ చేయడానికి పవన్ కళ్యాణ్ ఇప్పటికే డేట్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాలు దర్శకులు షూటింగ్ ఏర్పాట్లు కూడా మొదలుపెట్టారు. పవన్ కళ్యాణ్ చేస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా హరిహర వీరమల్లు షూటింగ్ కోసం విజయవాడలోనే ఏర్పాట్లు జరిగాయి. హరిహర వీరమల్లు షూటింగ్ సెప్టెంబర్ ఆఖరిలో లేదంటే అక్టోబర్ లో మొదలుపెట్టే అవకాశం ఉందంట. దీని తర్వాత సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఓజీ మూవీ షూటింగ్ కూడా పవన్ కళ్యాణ్ మొదలుపెట్టబోతున్నారు. విశాఖపట్నంలో సుజిత్ ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేయడానికి సెట్ రెడీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమా షూటింగ్ కూడా అక్టోబర్ లో స్టార్ట్ చేసే ఛాన్స్ ఉందని ఇండస్ట్రీ వర్గాలలో మాట్లాడుకుంటున్నారు. ఈ నాలుగు నెలల్లో హరిహర వీరమల్లు, ఓజీ షూటింగ్ కంప్లీట్ చేయాలని పవన్ డిసైడ్ అయ్యారంట. వీటి తర్వాత వచ్చే ఏడాది ఆరంభంలో ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ మొదలు పెట్టనున్నట్లు ప్రచారం నడుస్తోంది. అలాగే ఓజీ సినిమాని 2025 మార్చి ఆఖరిలో లేదంటే ఏప్రిల్ ఆరంభంలో రిలీజ్ చేసే అవకాశం ఉందంట. తర్వాత హరిహర వీరమల్లో మే లేదా జూన్ నెలలో ప్రేక్షకులు ముందుకి వచ్చే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. ఇంచుమించు రెండు నెలల గ్యాప్ లోనే ఈ రెండు సినిమాలు ఫ్యాన్స్ కి అదిరిపోయే ట్రీట్ ఇవ్వబోతున్నాయని ఇండస్ట్రీలో చెప్పుకుంటున్నారు. 2025 ఆఖరిలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాని రిలీజ్ చేయడానికి హరీష్ శంకర్ ప్లాన్ చేసుకుంటున్నారని ప్రచారం నడుస్తోంది. ఏ విధంగా చూసుకున్న పవన్ కళ్యాణ్ మూడు సినిమాల కూడా 2025 లో ట్రిపుల్ బొనాంజాగా అభిమానులను అలరించడం గ్యారెంటీ అని తెలుస్తోంది. అదే జరిగితే పవన్ కళ్యాణ్ కెరియర్ లోనే మొదటిసారి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఒకే ఏడాదిలో రిలీజ్ అయినట్లు అవుతుంది. ఈ మూడు సినిమాలు పైన కూడా భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో కచ్చితంగా రికార్డులు క్రియేట్ చేయడం గ్యారెంటీ అని ఫ్యాన్స్ బలంగా నమ్ముతున్నారు.

# బాలయ్య కూడా పోటీలో దిగేలా ఉన్నాడు



నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఒక డిఫరెంట్ యాక్షన్ మూవీ చేస్తోన్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో యాక్షన్ అండ్ కమర్షియల్ జోనర్ లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం మూవీ షూటింగ్ దశలో ఉంది. రీసెంట్ గా భారీ షెడ్యూల్ ని బాబీ కంప్లీట్ చేశారు. ఈ చిత్రంలో బాలయ్యకి జోడీగా ప్రగ్యా జైశ్వాల్ నటిస్తోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూజ్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాలయ్య కెరియర్ లోనే భారీ బడ్జెట్ తో ఈ సినిమా సిద్ధం అవుతోంది. త్వరలో మూవీ టైటిల్ ని ఎనౌన్స్ చేసే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ లో క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకి తీసుకొని రావాలని మేకర్స్ ముందుగా అనుకున్నారు. అయితే డిసెంబర్ లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప2' రిలీజ్ కాబోతోంది. అలాగే రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' ప్రేక్షకుల ముందుకొస్తోంది. దాంతో పాటు నితిన్ 'రాబిన్ హుడ్', నాగ చైతన్య 'తండేల్' చిత్రాలు రిలీజ్ అవుతున్నాయి. ఇవి కాకుండా కోలీవుడ్ డబ్బింగ్ సినిమాలు డిసెంబర్ రేసులో ఉన్నాయి. ఇంత పోటీ మధ్య రిలీజ్ చేయడం రిస్క్ అని భావించి %చీదీఖ%109 విడుదల సంక్రాంతి సీజన్ కి షిఫ్ట్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర'తో వస్తున్నారు. అలాగే వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో రాబోతున్నారు. 'విశ్వంభర' జనవరి 10న, 'సంక్రాంతికి వస్తున్నాం' జనవరి 11న రిలీజ్ కాబోతున్నాయి. అయితే బాలయ్య సినిమాలని వీటికంటే ముందుగా రిలీజ్ చేయాలని జనవరి 9న డేట్ ఫిక్స్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆల్ మోస్ట్ ఇదే డేట్ కన్ఫర్మ్ అయ్యే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు. త్వరలో మేకర్స్ టైటిల్ పోస్టర్ రిలీజ్ తో పాటు అఫీషియల్ గా రిలీజ్ డేట్ ని ఎనౌన్స్ చేసే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. సంక్రాంతిలో ఎన్ని సినిమాలు వచ్చినా కూడా ఆడియెన్స్ సపోర్ట్ అందరికి ఉంటుంది. కేవలం కంటెంట్ క్లిక్కయితే చాలు కలెక్షన్స్ గట్టిగా పెరుగుతాయి. కాబట్టి సంక్రాంతి బెటర్ అని బాలయ్య టీమ్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇక %చీదీఖ%109 షూటింగ్ కంప్లీట్ అయిన వెంటనే బాలయ్య బోయపాటి దర్శకత్వంలో 'అఖండ 2' మూవీ షూటింగ్స్ స్టార్ట్ చేస్తాడనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం 'అఖండ 2' ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. పాన్ ఇండియా రేంజ్ లో ఈ సీక్వెల్ తెరకెక్కనుంది.

# చీర కట్టుతో చూపు తిప్పుకోనివ్వని ఆయేషా ఖాన్


తెలుగు లో ముఖచిత్రం సినిమాతో పాటు పలు సినిమాల్లో నటించి ప్రస్తుతం లక్కీ భాస్కర్ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న ముద్దుగుమ్మ ఆయేషా ఖాన్. హిందీ ప్రేక్షకులకు బుల్లి తెర ద్వారా పరిచయం అయిన ఈ అమ్మడు తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. కెరీర్ ఆరంభంలో బుల్లి తెరపై చేసిన కార్యక్రమాలు, సిరీస్ ల కారణంగా వెండి తెరపై అవకాశాలు దక్కించుకుంటూ ప్రస్తుతం ఇండస్ట్రీలో కొనసాగుతోంది. ముందు ముందు హిందీలో ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేసే విధంగా ప్లాన్ చేస్తున్నట్లుగా ఆమె సన్నిహితులు, స్నేహితులు చెబుతున్నారు. హిందీ బిగ్ బాస్ సీజన్ 17 లో పాల్గొన్న ఆయేషా ఖాన్ కి మంచి ఫాలోయింగ్ దక్కింది. సోషల్ మీడియాలో మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ఈ అమ్మడికి ఇన్‌స్టాగ్రామ్ లో దాదాపుగా 5.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. బాలీవుడ్ హీరోయిన్స్ ని ఏమాత్రం తగ్గకుండా అందాల ఆరబోత చేస్తూ ఎప్పుడూ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉండే ఆయేషా ఖాన్ మరోసారి నెట్టింట షేర్ చేసిన



అందమైన ఫోటోల కారణంగా వైరల్ అవుతోంది. ఈసారి చీర కట్టి కుర్రకారును చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఆకట్టుకునే అందం తన సొంతం అంటూ మరోసారి నిరూపితం చేసింది. మత్తు కళ్లతో, కవ్వించే విధంగా చూస్తున్న ఆయేషా ఖాన్ తాజా ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ స్థాయిలో అందంగా ఉన్న ఆయేషా కాస్త బరువు తగ్గితే టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్స్ కి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు, మీడియా వర్గాల వారు కామెంట్స్ చేస్తున్నారు. ఎలాంటి ఫోటోలు షేర్ చేసినా ఆమె ఫ్యాన్స్ తెగ లైక్ చేస్తూ, షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. ఈసారి ఇంతటి అందమైన ఫోటోలు షేర్ చేసినందుకు గాను నెటిజన్స్ చూపు తిప్పుకోలేక పోతున్నాం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏక్తా కపూర్ షో కసౌతి జిందగీ కే లో జూనియర్ ఆర్టిస్టుగా కెరీర్ ను ప్రారంభించిన ఆయేషా ఖాన్ తక్కువ సమయంలో బాలీవుడ్, టాలీవుడ్ లో వరుసగా సినిమాలు చేసే స్థాయికి చేరుకుంది. ముందు ముందు ఈమె తెలుగు, తమిళంలో వరుసగా సినిమాలు చేయాలని కోరుకుంటున్నట్లుగా గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఇలాంటి ముద్దుగుమ్మలకు సౌత్ లో మంచి ఆధరణ ఉంది. కనుక కాస్త సీరియస్ గా ప్రయత్నిస్తే కచ్చితంగా బాలీవుడ్ లో ఈ అమ్మడికి మంచి అవకాశాలు దక్కడం ఖాయం. టాలీవుడ్ లోనూ ఈమె కి ముందు ముందు పెద్ద సినిమాల్లో ఛాన్స్ రావచ్చు.

# జిమ్ లో వర్ష హార్డ్ వర్క్.. స్టన్నింగ్ లుక్

సౌత్ లో మోస్ట్ టాలెంటెడ్ యాక్టర్స్ లలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న నటి వర్ష బొల్లమ్మ. సతురన్ అనే తమిళ్ మూవీతో వర్ష బొల్లమ్మ హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. తరువాత కళ్యాణం అనే చిత్రంతో మలయాళీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 2020లో చూసి చూడంగానే సినిమాతో వర్ష తెలుగులోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. మూడు భాషలలో కూడా వర్ష బొల్లమ్మకి యాక్టర్ గా మంచి ఇమేజ్ ఉంది. ఆమె చేసిన ప్రతి సినిమాలో కూడా మంచి పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న పాత్రలలోనే వర్ష కనిపించింది. ఆమె తన నటనతోనే ప్రేక్షకుల ప్రశంసలు సొంతం చేసుకొని అవకాశాలు దక్కించుకుంటుంది. వర్ష బొల్లమ్మ చివరిగా ఊరు పేరు భైరవకోన సినిమాలో శర్వానంద్ కి జోడీగా నటించింది.




ఈ సినిమా కమర్షియల్ సక్సెస్ అందుకోలేదు. ప్రస్తుతం అయితే వర్ష చేతులో పెద్దగా సినిమాలు లేవు. అయిన కూడా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా వర్ష తన అప్డేట్స్ ని షేర్ చేసుకుంటూ ఉంటుంది. దీంతో ఇన్ స్టాగ్రామ్ లో వర్షకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ పిక్స్ కంటే డిఫరెంట్ స్టైల్ లో తనని తాను రిప్రజెంట్ చేసుకుంటూ ఫోటోలని పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో ఈ అమ్మడు జిమ్ లో వర్క్ అవుట్స్ చేసిన తర్వాత అద్దం ముందు నిలబడి సెల్ఫీ తీసుకుంది. ఈ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలో వర్ష చాలా స్లిమ్ గా కనిపిస్తోంది. ఫేస్ లో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్ పెట్టి సెల్ఫీకి ఫోజులిచ్చింది. ఈ పిక్ పై ఇన్ స్టాగ్రామ్ లో చాలా ఫన్నీ కామెంట్స్ వస్తున్నాయి. ఇలాంటి ఫన్నీ ఫోటోలని వర్ష రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఫ్యాన్స్ కి వినోదాన్ని అందిస్తూ ఉంటుంది.




# తెలంగాణ సీఎంకు విరాళం అందజేసిన చిరంజీవి, ఇతర ప్రముఖులు



హైదరాబాద్: వరద బాధితుల సహాయార్థం పలువురు ప్రముఖులు సాయం అందజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రముఖ నటుడు చిరంజీవి రూ. 50 లక్షలు విరాళం ఇచ్చారు. రామ్ చరణ్ తరఫున మరో రూ.50లక్షలు అందజేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌ను కలిసి చెక్కులను ఇచ్చారు. అమర్ రాజా గ్రూప్ తరఫున సీఎం సహాయనిధికి మంత్రి గల్లా అరుణ కుమారి రూ.కోటి విరాళం, సినీ నటులు అలీ రూ.3 లక్షలు, విశ్వక్ సేన్ రూ.10లక్షలు అందజేశారు. సినీ నటుడు సాయిధరమ్ తేజ్ రూ.10 లక్షలు, గరుడ పల్లి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ సంజయ్ గరుడపల్లి రూ.25 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.

# గణేశ నిమజ్జనం.. ట్యాంక్‌బండ్ చుట్టూ 135 క్రేన్లు: మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్: గణేశ్ నవరాత్రులు విజయవంతమయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకుని పూజలు చేశారు.

అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని.. మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఇచ్చినట్లు చెప్పారు. నిమజ్జనం కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ట్యాంక్ బండ్ చుట్టూ 135, మొత్తం జీహెచ్ఎంసీ పరిధిలో 300కు పైగా క్రేన్‌లు అందుబాటులో ఉంటాయని వివరించారు. నిమజ్జన ఉత్సవాలకు ప్రజలు సహకరించాలని కోరారు. వీలైనంత వరకు మంగళవారం రాత్రి లోపు నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు.

# ఆంధ్రా, తెలంగాణ పేరిట జరిగే కుట్రలను భగ్నం చేస్తాం: ఎమ్మెల్యే దానం



తిరుమల: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు భారాసకు తగిన బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తిరుమల శ్రీవారిని వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అరెకపూడి గాంధీపై విమర్శలు చేసిన కౌశిక్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఆంధ్రా, తెలంగాణ అంటూ చేసే కుట్రలను భగ్నం చేస్తామన్నారు. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై ఆలోచించాలని హితవు పలికారు. హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో కబ్జాకు గురైన భూములను రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చినట్లు దానం నాగేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమే సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అన్యాక్రాంతమైన ప్రాంతాల్లో నివాసం ఉన్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

# నిమజ్జనానికి సిద్ధమైన ఖైరతాబాద్ గణేశుడు



హైదరాబాద్, సెప్టెంబర్ 16: పది రోజుల పాటు పూజలందుకున్న ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి సిద్ధమయ్యారు. రేపు (మంగళవారం) మధ్యాహ్నం మహాగణపతి గంగమ్మ ఒడికి చేరనున్నారు. నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా ఈరోజు ఉదయం ఖైరతాబాద్ గణనాథుడి వద్ద కర్రల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మహా గణపతి వద్దకు శోభాయాత్ర ట్రక్కు చేరుకుంది. ఈరోజు బడా గణేష్ దర్శనానికి భక్తులకు అనుమతి నిరాకరించారు. నాలుగు వైపులా బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. దర్శనం నిలిపివేత విషయం తెలియక బడా గణేష్ వద్దకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. అనుమతి లేకపోవడంతో భక్తులు నిరాశగా వెను తిరుగుతున్నారు.

మరోవైపు ట్యాంక్‌బండ్ వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంది. హుస్సేన్ సాగర్ చుట్టూ భారీగా క్రేన్లు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, జలవిహార్, బేబీ వాటర్ పాండ్ వద్ద క్రేన్లు ఏర్పాటు చేశారు. హుస్సేన్ సాగర్ చుట్టూ మొత్తంగా 31 క్రేన్లు ఏర్పాటు అయ్యాయి. క్రేన్ నంబర్ 4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం జరుగనుంది.

**బారులు తీరిన గణనాథులు :** మరోవైపు గణేష్ విగ్రహాల నిమజ్జనాలతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్‌జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనాల కోసం భారీగా వాహనాల రాకతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్, లక్డీకాపూల్ సహా పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. ఖైరతాబాద్, లక్డీకాపూల్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వినాయక నిమజ్జనాలు ఆలస్యం అవుతున్నాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ సరిపడా క్రేన్లు లేకపోవడంతో నిమజ్జనం కోసం గణనాథులు బారులు తీరాయి. దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. అర్ధరాత్రి నుంచి నిమజ్జనాల కోసం గణనాధులు వెయిటింగ్‌లో ఉన్నాయి. అలాగే ఈరోజు వర్కింగ్ డే కావడంతో విపరీతంగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఖైరతాబాద్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్ మార్గాలను పోలీసులు మూసివేశారు. ట్యాంక్ బండ్‌కు వచ్చే వాహనాలు దారి మళ్లించారు.

**భారీ ఏర్పాట్లు..** మరోవైపు గ్రేటర్‌లో నిమజ్జనానికి జీహెచ్ఎంసీ భారీగా ఏర్పాట్లు చేసింది. 75 పాండ్స్‌తో పాటు 5 చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 140 స్టాటిక్ క్రేన్లు, 295 మొబైల్ క్రేన్లు, 125 జెసిబిలు, 102 మినీ టిప్పర్లు సిద్ధంగా ఉన్నాయి.

నిమజ్జన డ్యూటీలో 20వేల మందికి పైగా జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొననున్నారు. హుస్సేన్ సాగర్ చుట్టూ 31 క్రేన్లు ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్‌పై 7 క్రేన్లు, ఎన్టీఆర్ మార్గ్‌లో 9, పీపుల్స్ ప్లాజా వద్ద 7, జలవిహార్ వద్ద 4 క్రేన్లు సిద్ధం చేశారు. అర్ధరాత్రి నుంచి ట్యాంక్ బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇస్తున్నారు.

# విమోచన దినోత్సవం అనేందుకు కాంగ్రెస్ జంకుతుంది



కరీంనగర్ జిల్లా: హిందువుల పండుగలకే ఆంక్షలు, నిబంధనలు ఎందుకని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవమని... తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చినరోజు అని గుర్తుచే శారు. రజాకార్ల అరాచకాలని మనం ఎప్పుడూ మరిచిపోలేమని బండి సంజయ్ అన్నారు. బీజేపీ కేంద్ర కార్యాలయంలో బండి సంజయ్ ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మరిచిపోయిందని.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ఎంఐఎం పార్టీకి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు భయపడి సెప్టెంబరు 17ను జరపడం లేదని విమర్శించారు. ఓవైసీ కాలేజీని హైడ్రా ఎప్పుడు కూల్చుతుందని బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో ఎవరూ అధికారంలో ఉంటే వారికి కొమ్ముకాసే పార్టీ ఎంఐఎం అని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగస్టు 15లాగా తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా జరుపుతామని స్పష్టం చేశారు. మొన్నటిదాక హైడ్రా..... ఇప్పుడు విగ్రహాల లొల్లి అని విమర్శలు చేశారు. ప్రజా పరిపాలన దినోత్సవం అంటే తాము ఒప్పుకోమని... తెలంగాణ విమోచన దినోత్సవం అనడానికి కాంగ్రెస్ పార్టీకి అంత భయమెందుకని బండి సంజయ్ నిలదీశారు.




దిల్లీ: మెట్రో నగరాల మధ్య రైలు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ఉద్దేశించిన వందే మెట్రో రైలు పేరు మారింది. ఇక నుంచి దానిని నమో భారత్ ర్యాపిడ్ రైల్‌గా పిలవనున్నారు. దేశంలోనే తొలి వందే మెట్రో సర్వీసు ఈరోజు (సెప్టెంబర్ 16) ప్రధాని మోదీ చేతుల మీదుగా గుజరాత్‌లో ప్రారంభం కానున్న తరుణంలో ఈ ప్రకటన వచ్చింది. దేశంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. అమృత్ భారత్ రైలూ అందుబాటులోకి వచ్చింది. ఈ రోజు నుంచి ఈ వందే మెట్రో పట్టాలెక్కనుంది. వందే మెట్రో అనేది పూర్తి అన్‌రిజర్వ్‌డ్ ఎయిర్ కండీషన్‌తో కూడిన రైలు. ఇందులో 1150 మంది కూర్చుని, 2058 మంది నిల్చుని ప్రయాణం చేయొచ్చని పశ్చిమ రైల్వే వెల్లడించింది. అహ్మదాబాద్- భుజ్‌ల మధ్య 9 స్టాపుల్లో ఈ రైలు ఆగుతుందని తెలిపింది. 360 కిలోమీటర్ల దూరాన్ని 5 గంటల 45 నిమిషాల్లోనే చేరుకుంటుందని చెప్పింది. గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని పేర్కొంది. ప్రతి రోజూ ఉదయం భుజ్‌లో 5.05 గంటలకు ప్రారంభమై అహ్మదాబాద్ జంక్షన్‌కు 10.50 గంటలకు చేరుకుంటుందని పశ్చిమ రైల్వే(అహ్మదాబాద్) పీఆర్ఓ ప్రదీప్‌శర్మ వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రయాణికులు కొన్ని నిమిషాల ముందే టికెట్ కొనుక్కుని రైలు ఎక్కొచ్చని తెలిపారు.

వందేభారత్ తరహాలోనే పూర్తి ఏసీ కోచ్‌లు, కవచ్ వంటి భద్రతా సౌకర్యాలతో దీన్ని రూపొందించినట్లు చెప్పారు. కనీస టికెట్ ధర రూ.30గా నిర్ణయించినట్లు తెలిసింది.




బీజింగ్: చైనాను బెబింకా వణికిస్తోంది. సోమవారం ఉదయం డ్రాగన్ ఆర్థిక నగరమైన షాంఘైను ఈ టైఫూన్ తాకి, విజృంభిస్తోంది. గత ఏడు దశాబ్దాల కాలంలో ఈ నగరాన్ని తాకిన తీవ్ర తుపాను ఇదేనని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో ప్రజాజీవితం అస్తవ్యస్తమైంది. గంటకు 151 కి.మీ. వేగంతో ఈరోజు తుపాను షాంఘై (%హ్ఘుఅస్త్ఘుఱ%)ను తాకిందని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ నగరాన్ని తుపాన్లు నేరుగా తాకడం అరుదు. 1949లో టైఫూన్ గ్లోరియా తర్వాత షాంఘైను తాకిన తీవ్ర తుపాను ఇదే. దీంతో ఆదివారం రాత్రి నుంచి అక్కడి రెండు విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన వందల విమానాలు రద్దయ్యాయి. పలు రైళ్లు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పలు పార్కులు, వినోద ప్రదేశాలను తాత్కాలికంగా మూసివేశారు. ఇదిలాఉంటే.. ఇటీవలే చైనాలోని హైనాన్ ప్రావిన్స్‌ను యాగి తుపాను ఇబ్బందిపెట్టింది. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిశాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. సెల్‌ఫోన్‌లలో ఛార్జింగ్ అయిపోవడంతో డిజిటల్ చెల్లింపులకు ప్రజలు నానాతంటాలు పడ్డారు. కనీసం నిత్యావసర సరకులు సైతం కొనుగోలు చేయలేని పరిస్థితులు ఎదుర్కొన్నారని పలు మీడియా కథనాలు వెల్లడించాయి.

# రేవంత్ రెడ్డి.. నీ గుండెల్లో నిద్రపోతా: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి..



హైదరాబాద్: తనను హత్య చేయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పంపించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కౌశిక్ రెడ్డిని హత్య చేయాలంటూ తానే పంపించినట్లు పరోక్షంగా సీఎం చెప్పారని ఆయన వెల్లడించారు. కానీ మంత్రి శ్రీధర్ బాబు ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గొడవపడ్డారని అంటున్నారని, వారిద్దరూ చెప్పే మాటలకు ఎక్కడా పొంతన లేదని ఎమ్మెల్యే అన్నారు. తనపై హత్యాయత్నం చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని తెలంగాణ డీజీపీని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

**సీఎంపై కేసు పెట్టాలి..** ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.."నాపై దాడి చేసేందుకు తానే పంపినట్లు సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు. నన్ను హత్య చేయాలని ఎందుకు అనుకుంటున్నారు సీఎం గారు?. మీరిచ్చిన హామీలు నెరవేర్చాలంటూ ప్రశ్నిస్తున్నా కాబట్టి హత్య చేయాలని అనుకుంటున్నారా?. రేవంత్ నన్ను హత్య చేయాలని ఒప్పుకున్నారు. దీనిపై డీజీపీ, హోమ్ సెక్రటరీ స్పందించాలి. లేకుంటే గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలుస్తాం. సీఎంపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని డీజీపీని డిమాండ్ చేస్తున్నా. ఈ విషయంలో సైబరాబాద్ సీపీ డైనమిక్‌గా పని చేయాలి.

**ఎవరినీ వదలం..** ఒక ఎమ్మెల్యే ఇంటి మీదకు ఎస్కార్ట్ ఇచ్చి మరీ ఎటాక్ చేపిస్తే ఇప్పటివరకూ చర్యలు తీసుకోరా?. కాంగ్రెస్ పాలన శాశ్వతం కాదు.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలిపెట్టం. చంపితే చావడానికి సిద్ధమే, కానీ రేవంత్ రెడ్డితో కాంప్రమైజ్ మాత్రం కాను. ఆరు హామీలు అమలు చేసే దాకా సీఎం గుండెల్లో నిద్రపోతా. నా ఇంటికి వచ్చావ్. నన్ను పీసీసీ చీఫ్ చేయమని నా కాళ్లు మొక్కినవ్. తెలంగాణ నీ అయ్య జాగీరా?. చంపేస్తామంటూ నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. భయపడేది లేదు. నన్ను ఎవరైనా హత్య చేస్తే రేవంత్ రెడ్డిదే బాధ్యత.

**ఆ ఇల్లు కూల్చరా? :** సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి హైడ్రా నోటీసులు ఇచ్చి 20రోజులు అవుతుంది. ఇప్పటివరకూ ఇల్లు ఎందుకు కూల్చలేదు. తన అన్న ఇల్లు కూల్చుతానని చెప్పిన సీఎం ఆయనకు మరో ఇల్లు ఇప్పించారు. బిల్డర్‌ను బెదిరించి మరీ తన సోదరుడికి ఇంటిని ఇప్పించారు. మరి పేద ప్రజల పరిస్థితి ఏంటి?" అంటూ ప్రశ్నించారు.

# వైన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు: మందు బాబులకు క్లాస్



నల్గొండ, సెప్టెంబర్ 16: మందు బాబులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్లాస్ పీకారు. సోమవారం ఉదయం మునుగోడు పట్టణంలోని పలు వైన్ షాపుల్లో స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్మిట్ రూమ్‌ల్లో మద్యం తాగుతున్న మందు బాబులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి మాట్లాడారు. ఉదయాన్నే ఇలా మందుకు బానిస అయి వైన్ షాపులకు వస్తే.. కుటుంబ పరిస్థితి ఏమిటంటూ వారిని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. దీంతో వారంతా మౌనంగా ఉండిపోయారు. దీంతో మద్యం తాగుతున్న వారిని పర్మిట్ రూమ్‌ల నుంచి బయటకు పంపేశారు. పర్మిట్ రూముల్లోకి ఉదయమే ఎవరిని అనుమతించ వద్దంటూ వైన్ షాపుల యజమానులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ప్రజలు అధిక మద్యం సేవించడాన్ని నిర్మూలించేందుకే తాను వైన్ షాపులను పరిశీలించినట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తున్నారా? అంటూ వైన్ షాపు యజమానులను ఈ సందర్భంగా ఆయన ఆరా తీశారు. అలాగే నకిలీ మద్యం విక్రయిస్తున్నారా? అంటూ వైన్ షాపు నిర్వాహకులకు ప్రశ్నించారు. వైన్ షాపులోని మద్యం బాటిల్స్‌లపై లేబుల్స్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి పరిశీలించారు.

# ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్..

హైదరాబాద్: శనివారం అర్ధరాత్రి నుంచి ట్యాంక్ బండ్‌పై నిమజ్జనాలకు తెలంగాణ సర్కార్ అనుమతి ఇవ్వడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్, లకిడికాపూల్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ఎటు చూసినా భారీగా వాహనాలు దర్శనమిస్తున్నాయి. 9వ రోజు కావడంతో నిమజ్జనం చేసేందుకు విగ్రహాలను పెద్దఎత్తున తీసుకువస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాల నుంచి వెళ్లేందుకు గంటల తరబడి సమయం పడుతోంది. అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లింపు చర్యలు చేపట్టారు. మరోవైపు గణేశ్ నిమజ్జనానికి జీహెచ్ఎంసీ భారీ ఏర్పాట్లు చేసింది. సుమారు 80ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులు నిమజ్జన ఏర్పాట్ల చేశారు. 140స్టాటిక్ క్రేన్లు, 295మొబైల్ క్రేన్లు, 125జేసీబీలు, 102మినీ టిప్పర్లను సిద్ధం చేశారు. నిమజ్జన డ్యూటీలో 20వేల మందికి పైగా జీహెచ్ఎంసీ సిబ్బంది పని చేస్తున్నారు. హుస్సేన్ సాగర్ చుట్టూ 31క్రేన్లు ఏర్పాటు చేశారు.

అలాగే ట్యాంక్ బండ్‌పై 7, ఎన్టీఆర్ మార్గ్‌లో 9, పీపుల్స్ ప్లాజా వద్ద 7, జలవిహార్ వద్ద 4 క్రేన్లు సిద్ధం చేశారు. అయితే హుస్సేన్ సాగర్ చుట్టూ సరిపడా క్రేన్లు లేకపోవడంతో నిమజ్జనం ఆలస్యం అవుతోంది. దీంతో పెద్దఎత్తున గణనాథులు బారులు తీరి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 17, 18తేదీల్లోనూ భారీగా నిమజ్జనాలు ఉండడంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రూట్ మ్యాప్ విడుదల చేశారు. గణేశ్ నిమజ్జన ఊరేగింపు, ట్రాఫిక్ నిబంధనలు, పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల రూట్ ఎంట్రీపై ఆంక్షలు విధించారు. అలాగే భారీ, అతి భారీ వాహనాలకు అనుమతి నిరాకరించారు. వాహనదారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com